ఆదివారం
ప్రజాశక్తి
అక్టోబర్ 31, 2004

తెంగ్లీష్ తల్లికి మంగళహారతి!

హ్యాపీ బర్త్‌డే

(31-10-2004 నుండి 6-11-2004 వరకు)

మౌన్య
2సం॥, 31.10.2002
మాధురి-శ్రీనివాస్
గోపాలపట్నం-విశాఖపట్నం

శ్రీచందన
2సం॥, 31.10.2002
శారద-సంపత్
చీమకుర్తి-ప్రకాశం

మారుతీసాయి-లక్ష్మీనరసింహ్మాసాయి మౌళి
అక్టోబర్-31
శివనాగజ్యోతి-శ్రీనివాసరావు
పూనూరు-ప్రకాశం

మేఘన కృష్ణసాయి
2సం॥, 31.10.2002
రామలక్ష్మి-శ్రీనివాసరావు
రాజమండ్రి-తూ॥గో॥

దాక్షాయణి
6సం॥, 31.10.1998
కృష్ణవేణి-ఉమామహేశ్వరరావు
కురుపాం-విజయనగరం

రమా సాయిశ్రీ
7సం॥, 31.10.1997
గజలక్ష్మి-జ్ఞానేశ్వరరావు
రామవరం-కృష్ణా

రేవంత్‌సాయి
7సం॥, 31.10.1997
రమణి-దుర్గాప్రసాద్
ఉక్కునగరం-విశాఖ

చంద్రిక(నాని)
1సం॥, 1.11.2003
శిరీష-శ్రీనివాసరెడ్డి
ఆత్మకూరు-గుంటూరు

కళ్యాణి
4సం॥,1.11.2000
పద్మావతి-వెంకట్రావు
ఒంగోలు-ప్రకాశం



కె.వి.పి.ఎస్.డి. రాజేశ్వరి
1సం॥1-11-2003
వరలక్ష్మి-వెంకటేశ్వరరావు
కొత్తపేట-తూ॥గో॥

గాయత్రి
1సం॥, 2-11-2003
ఉమాదేవి-ఉపేంద్ర
కొత్తగూడెం-ఖమ్మం

కార్తిక్
సెప్టెంబర్-2
నిర్మల-ఆంజనేయులు
దొండవారిగూడెం-నల్లగొండ

నాని
1సం॥, 3.11.2003
జంగమ్మ-బుగ్గరాములు
సాహెబ్‌గూడ-రంగారెడ్డి

సాయిసుధ
1సం॥, 6.11.2003
నాగదుర్గాదేవి-కోటేశ్వరరావు
మిట్టపాలెం-గుంటూరు

శ్రీమంతిని
6సం॥,అక్టోబర్-1998
లీల-శ్రీనివాస్
బంజరాహిల్స్-హైదరాబాద్

అహల్య
2సం॥, అక్టోబర్-2002
విజయ-జగన్
గూడూరు-నెల్లూరు

ముఖేష్
1సం॥, అక్టోబర్-2003
లక్ష్మీబాయి-శ్యామ్‌లాల్
బోరబండ-హైదరాబాద్

కోమలి
జోస్‌మేరీ విల్సన్
గుంటూరు

సౌమ్య
రాజేశ్వరి-రమేష్

అరవింద్‌కుమార్
7సం॥, అక్టోబర్-1997
అచ్చంపేట-మ॥నగర్



గోరు రోహిత్
1సం॥, అక్టోబర్-2003
తులసి-సత్యనారాయణ
శ్రీకాకుళం

లీడర్స్ మెయిల్

దసరా సరదా కవర్

17వ తేదీ సంచిక ప్రచురించిన "దసరా మా ఊళ్ళో భలే సరదా'' కవర్‌స్టోరీ చదువుతున్నంతసేపూ భక్తితో మా మనస్సుని ఎంతో రంజింపజేసింది. దుష్టశిక్షణ శిష్ట జనరక్షణకు శుభసూచనగా ఈ దసరా పండుగను మానవకోటి జరుపుకుంటారు. పలుప్రాంతాలలోని ప్రజలు వారి ఆచారాల ప్రకారం దుర్గమ్మతల్లిని పూజించుతూ దసరా నవరాత్రుల పండుగ వేడుకలకు, జరిపేవిధానానికి చక్కని విశ్లేషణ చేసారు. దసరాపండుగ రోజుల్లో ఇలాంటి కవర్‌స్టోరీ ఇవ్వడం బాగుంది.

-జొన్నాడ వెంకటేశ్వరరావు, విజయవాడ

అలరించిన దసరా

దుష్టత్వాన్ని అంతంచేసిన పదవరాత్రి 'దసరా'గా అభివర్ణించి రాసిన కవర్‌స్టోరీ బాగుంది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో ముఖ్యముగా కరీంనగర్‌జిల్లా గోదావరిఖనిలో, మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలలో ఆయుధపూజ, కృష్ణాజిల్లా బందరులో శక్తిపటాల పూజలు, విజయవాడలోని కనకదుర్గ ఆలయంలో జరిగే భేతాళనృత్యాలు, తెలంగాణాలో బతుకమ్మలు తదితర సంబరాలు జరిగేతీరు ఈ కవర్‌స్టోరీ ద్వారా విపులంగా తెలుసుకోగలిగాం. ఆరోగ్యపేజీలో 'బ్లడ్‌ప్రెషర్ సెల్ఫ్ మోనిటరింగ్' గురించి తెలుసుకోగలిగాం. దసరా ఉత్సవాల మైసూర్‌ప్యాలెస్ గుర్చి టూరిస్ట్ గైడ్‌లో తెలుసుకున్నాము.

-కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్‌జిల్లా.

అకాడా

పలుప్రాంతాల కుటుంబాలు ఎన్నో నల్లగనిలో బతకడానికి వచ్చి కార్మికులుగా ఇక్కడ స్థిరపడిపోయాయి. వారితోపాటు నీడలా వారి సంస్కృతి రావడం సహజం. గోదావరిఖని అయినా పల్లె వాతావరణంలో జరిగే దసరా ఉత్సవాలు చూడముచ్చటగా వుంటాయి. క్షత్రియులు చేసే ఆయుధ విన్యాసాలైన, రావణాసురుడి బొమ్మ సంహరించడంతో మొదలై గోదావరిఖని ఉగ్రూతలూగుతుంది.

-పెందోట సుప్రియ,
పెద్దశంకరంపేట, మెదక్‌జిల్లా.

కవర్ ఆకర్షణీయం

కవర్‌పేజీపై కనకదుర్గమ్మ బొమ్మ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. మంచి కలర్ ఇచ్చారు. మా ఇంటి కుటుంబసభ్యుల్నందర్ని ఆకట్టుకుంది. బలిపీఠం కథ, ఒక్కొక్కరికో న్యాయం(జీవనశైలి), త్రినేత్రి (రియల్‌స్టోరీ), ఆరోగ్యం, న్యాయసలహాలు ఇలా ప్రతీ శీర్షిక మాకు బాగా నచ్చాయి.

-అన్నే వెంకటకృష్ణారావు, గన్నవరం, కృష్ణాజిల్లా.

బలిపీఠం కథ

కథ చాలాబాగుంది. వరమ్మ జీవితాన్ని 'కరువు' ఎలా బలికోరిందో ఈ కథ కళ్ళకు కట్టినట్లుంది. కరువుతో అల్లాడుతున్న పేదప్రజలకు ఈ కథ దర్పణం. ఈ కథ కన్నీరు పెట్టిస్తుంది. ఇనుప మొక్కలేరుకునే వరమ్మపై పోలీస్ లాఠీల క్రౌర్యం కోపం తెప్పిస్తుంది.

-ఎస్‌కే జానీబాషా, ఇంకొల్లు, ప్రకాశం;
-షేక్ వలీసాహెబ్, కరుణాకర్, మరియు
మిత్రులు యర్రగొండపాలెం, ఒంగోలు

నిజంగా త్రినేత్రియే!

రియల్‌స్టోరీలో ఒక అంధురాలు తాను ఎంచుకున్నవాటిని సాధించిన తీరు ఎందరికో ఆదర్శ ప్రాయం. తన జీవితంలో ముందుకెళుతూనే సేవా సంక్షేమ, కార్యక్రమాలు చేయడంతోపాటు పేదల పక్షాన వాదించడం కోసం న్యాయపట్టాను పొందినదంటే చాలా గొప్ప విషయమే. ఈ వారం కలర్ కవర్‌పేజీ చాలా అందంగా ఉంది. ఆదివారం అనుబంధంలో పేజీలు పెంచాలి.

-పి నరేందర్‌రెడ్డి, గిరాయిపల్లి, మెదక్‌జిల్లా.

మనోనేత్రి

తనకు చూపులేకపోయినా తన మనోనేత్రంతో చూడగలనన్న ఆత్మవిశ్వాసంతో ఎత్తయిన శిఖరాన్ని అధిరోహించడం నిజంగా కాంచన్ సాహసి, ధైర్యవంతురాలు.

-మేడూరి సత్యనారాయణ,
ఖైరతాబాదు, హైదరాబాదు.

కార్టూన్ కదంబం

ఆదివారం సంచికలో కార్టూన్ కదంబం చూసిగానీ లోపలి విషయాలు పట్టించుకోను. కార్టూన్‌లు నడుస్తున్న వ్యవస్థకు అద్దం పట్టినట్లున్నాయి. ఈ సంచిక దసరా ఉత్సవాల సంచిక అవ్వడంతో ముఖచిత్రం బాగుంది. దుష్టత్వానికి ప్రతీక అయిన రాక్షసుణ్ణి అంతం జేసినరోజు విజయదశమి, సరదా పండుగ విశేషంగా వర్ణించిన తీరు బాగుంది. 'డెడ్ ఆర్ ఎలైవ్' అనే అక్షరాలతో రూపొందించిన బిన్ లాడెన్ బొమ్మ ఈ సంచికకు ప్రత్యేకం అనిపించింది.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడరూరల్.

గుడియా కథ

'గుడియా కహానీ' అంత తేలికగా తీసేసే విషయంగాదు. గుడియా మొదటి భర్త ఆరిఫ్ ఆమెకు మరో పెళ్ళి జరిగిపోయిన ఐదేళ్ళకొచ్చాడు. సంచలనం కలిగిస్తున్నాడు. రెండో భర్త ద్వారా గర్భవతి అయిన గుడియా ఎవరికి చెందుతుంది? నిస్సందేహంగా రెండో భర్తకే. మొదటిభర్తకు నిలదీసేహక్కు లేదు.

-ఎండి ముస్తఖీమ్, కొల్లాపూర్,
మహబూబ్‌నగర్‌జిల్లా.

ఇదా నీ జాడ !?

డా॥ నాగినేని భాస్కరరావుగారి కవిత బాగుంది. తెలుగువాడు తన తెగులు వదిలించుకోవాలని సందేశమిచ్చింది.

-పెందోట వెంకటేశ్వర్లు,
బద్దిపడగ, మెదక్‌జిల్లా.

మనలో మాట

అన్నీ ఉన్నాయనుకునే అల్లుళ్ళం....

ఈ పాటికి మీకు...

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని- అన్న సామెత తట్టేసుంటుంది.

అన్నీ బాగుంటే పరిస్థితుల చేతిలో మనం కొత్తల్లుళ్ళమే...కొందరం పాతల్లుళ్ళమే!

ఇది పండగల సీజనుకదా...దసరా మామూళ్ళ పండుగ చాలా మామూలుగా అయ్యింది. పరిస్థితులు అంత బాగోలేవు కదా...

ఎక్కడదాకో దేనికండీ...పండుగపూట పులిహోరలో పులుపు రుచి తగ్గింది. చింతపండు రేటుకి 'పండగొచ్చింది' మరి... ఏం చేయగలం!

రాబోయే దీపావళి టపాసుల రేట్లు ఎంతగా 'ధమాల్...ధమేల్' మని పేలనున్నాయో...? అప్పటి 'పరిస్థితులమావగారి'కి మనం ఏపాటి అల్లుళ్ళమో!

రేపేమో... మన రాష్ట్రం ఏర్పడినరోజు. మాటాడుకునేవాళ్ళంతా ఒకభాషోళ్ళుగా ఉన్నవాళ్ళకు ఒక రాష్ట్రం కావాలని శతపోరు పెడితే... తెలుగుమాట్లాడేవాళ్ళంతా ఆంధ్రరాష్ట్రంగా ఉండండి ప్పొండన్నారు.

ఇంకేముంది మన రాష్ట్రానికన్నీ ఉన్నాయి... మనకందరకూ అల్లుళ్ళమేనన్నంత ఘనంగా ఉంటుందిలెమ్మని నవంబరొకట్లు ప్రతీ ఏడూ జరిపేయడం మొదలెట్టాం.

తీరాచూస్తే ఏముంది? సిమ్మెంటు కాంక్రీటంత బలంగా పాతుకుపోయిన ఆ పాతసామెతకేం లోటూ జరగనంత వైభవం జరిగిపోతోంది.

ప్రకృతి వనరులు 'అన్నీ ఉన్నాయి. కానీ ప్రజలనోట్లో....'

జీవనదులూ, సాగుభూములు 'అన్నీ ఉన్నాయి...కానీ వ్యవసాయం నోట్లో....'

అన్నీ ఉన్నాయి అల్లుడినోట్లో అంటూ ఈ సామెత... ఈ సామెతేంటి దాదాపు అన్ని సామెతలూ మొగవాళ్ళనుద్దేశించేనా...మగవారి నోట్లోనేనా...అని ఏ ఫెమినిస్టాలోచనో 'శని'లో మా వాటా ఏంటని అడగొచ్చు.

ఆ వాటాని దేనితోనూ సమానం చేయలేం.

అన్నీ ఉన్నా కోడలి ఒంటికి వాతలే. క్షమించేయండి తల్లుల్లారా. సామెతలో ఇంతకన్నా వాటా ఇవ్వలేనంటోంది మన భాష.

భాషలోనూ..."అన్నీ ఉన్నా......"

❖

ఈ సంచికలో . . .

ఓరా!	. . .	3
కార్టూన్ కదంబం...	. . .	4
కవర్ స్టోరీ	. . .	5
జీవనశైలి	. . .	10
బాలల కథ	. . .	11
బాలనేస్తాలు	. . .	12
ఇంతిసంగతులు	. . .	16
నువ్వుల్లి	. . .	17
ఆరోగ్యం	. . .	18
పుస్తక పరిచయం	. . .	20
న్యాయసలహాలు	. . .	24

ఇంకా...

శత్రుత్వాలు కథ ... 8, 9



కీర్తి పతాక
రియల్ స్టోరీ ... 14, 15

మైసూరు బృందావనం
టూరిస్ట్‌గైడ్ . . . 21

సినీ జానపద కవిరాజు కొసరాజు
కళాసాహితి . . . 22, 23

ఓరా!

ఈ కుక్కకి 'ఒళ్ళంత' చెవులు!

"మా కుక్కకి ఒళ్ళంతా చెవులే...చీమ చిటుక్కుమన్నా, గుండుసూదంత వస్తువు అలికిడైనా ఇట్టే పసిగట్టేస్తుంది తెలుసా?!" అని కొంతమంది గొప్పగా చెప్పుకుంటారు. ఈ పక్క ఫొటోలో ఉన్న శునకమహాన్ కి ఒళ్ళంతుందో అంతేసి చెవులు! ఒకొక్క చెవి కొలతేస్తే 33.2 సెంటీమీటర్లుంది. రెండేళ్ళ వయస్సున్న ఈ గ్రామసింహం అమెరికాదేశాన ఫ్రాంక్‌ఫర్ట్‌సిటీ దగ్గర్లోని ఫల్డా ఊరి ఇంటిసింహం. వినికిడెక్కువో, మొరుగుడెక్కువో గానీ 'జాక్' అనే పేరుగల ఈ కుక్కేశ్వర్రావుని 'అతి పొడవుచెవుల కుక్కగారు'గా గిన్నిస్‌బుక్ రికార్డులోకి ఎక్కించేందుకే పెంచుతున్నారుట!

వెయ్యిరూపాయిలకే దసరా డ్యాన్సు

దసరా నవరాత్రి సందర్భంగా 'ముంబయి', 'నవీ ముంబయి' అనే డ్యాన్సుస్కూల్స్ వారు ఒక ప్రత్యేక ఆఫర్ ఇచ్చారు. "మీ పండుగ సంతోషాలకు తగ్గట్టుగా రకరకాల డ్యాన్సులు నేర్పుతున్నాం. ఈ దసరా సరదాకోసం కేవలం వారంరోజుల్లోపే దసరాన్రృత్యం నేర్పేస్తాం. అందుకు మా ఫీజు రూ. 1,000/- మాత్రమే" అని బోర్డుపెట్టారు. అసలే సినిమాలు ఓ పక్క పెళ్లికీ పబ్బానికీ చావులకీ ప్రేమలకీ ఒకటేమిటీ అన్నిటికీ సకుటుంబ సపరివార సమేత బృందనృత్యాలు స్పెషలైజ్‌చేసి, జూమ్‌చేసి అందరి బుర్రల్లోకి ఎక్కించాయి మరి! పేదవర్గాలు తమ సంతోషాల సంబరాల వేడుకల ఊపుకి కాస్త కల్లు పట్టించి డ్యాన్సులేస్తే వాటిని 'యా...క్ ఏంటీ నాస్టీ' అనేచోట ఇప్పుడదే ఫాషనైంది మరి!! ఆ ఫాషన్‌కొక మార్కెట్టుంటుంది కదా....అదన్నమాట వెయ్యి రూపాయలకే పండుగ డ్యాన్సు వారంలోపల మీకు నేర్పుతాం అనే గిరాకీ!!!

ఈ ఫొటో చూసి పదవుల పందేరాల కోసం పార్టీ సమావేశంలోని ఫైటింగ్ సీన్ అనుకునేలా లేదు. ఎవడి కుర్చీని వాళ్ళు ఇళ్ళకేసుకుపోతున్నారా అనిపించొచ్చు కానీ, వాళ్ళలా జారుకునే స్టిల్‌లో లేరు. మరేంటాని వివరం చూస్తే మొన్నామధ్య సోనియామాత మహారాష్ట్ర ఎన్నికల సభకొస్తే, ఆమెగారితో పాటు వానొచ్చే. తలదాచుకోను చోటులేక తమకిందున్న కుర్చీని తలకెక్కించుకుని గొడుగులా వానజల్లుకి అడ్డుపెట్టుకున్నారు. మరందుకే షామియానావాడు "నా కుర్చీలు బాబో" అనే సీన్ ఇందులో లేంది!!

కుర్చీలు బాబో కుర్చీలు....

కార్టూన్ కదంబం



మందిరం
అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరిగి తీరుతుంది —అద్వానీ



నిత్యావసర వస్తువుల జాబితా నుంచి ఉల్లిపాయల తొలగింపు



విస్తరణ
అసమ్మతి
మంత్రివర్గ విస్తరణ

తెంగ్లీష్ తల్లికి మంగళహారతి!

నవీన్ ముదునూరు

"ఐ సా ఏ స్నేక్ ఆన్ ది చెరువు కట్ట ఇవ్వాళ పొద్దునేరా... బట్ ఐతే కొట్టేవాణ్ణేగానీ హాత్‌మే దుడ్డు కర్రా నహీ హై" అని ఓ పదేళ్ళకు ముందు చెప్పుకుని నవ్వుకునేవాళ్ళం. అదొక నవ్వులాట కోసం భాషల సంకరంచేసి సరదా చేసేవాళ్ళం. కానీ ఇప్పుడదే ఫాషనయ్యింది. వాడుకయ్యింది. "తెలుగుభాషకు నిజమైన మూలధనం తెలుగు తప్ప మరొక భాషను మాట్లాడలేని, రాయలేని వారే" అని ఇటీవలి ప్రజాభాషోద్యమాలు అంటున్నాయి. ఎవరిభాషను వాళ్ళు రక్షించుకోవాల్సిన అగత్యమీరోజున అన్ని దేశాలమీద పడిందని కెన్యా ప్రజారచయిత గూగీ వా థియాంగో అంటున్నారు. "ప్రపంచంలో ప్రతీ ఒక్కడికీ భాష వుంది. అది తల్లిదండ్రుల భాష కావచ్చు. పుట్టినప్పటి నుంచి వాడిన భాష కావచ్చు. ఆ తర్వాత జీవితంలో నేర్చుకున్నది కావచ్చు. మన భాషల, సంస్కృతుల మూలాలు తెలుసుకుంటే, ఇంగ్లీషును ప్రపంచభాషగా పరిగణించాలో లేదో ఆలోచించవచ్చు" అని కూడా గూగీ అంటున్నారు. ప్రతీదీ మార్పుకి గురౌతుంది. అనివార్యం. లేకుంటే అది మృతభాష అవుతుంది. అలాగే మన తెలుగుభాష కూడా అనేక మార్పులను స్వీకరించింది. అయితే ఆ మార్పు సహజంగా ఉంటే నీటిచెలమలో ఊటలా భాషలో కొత్తపదాలు కలగలసిపోయాయి. కానీ ఇటీవల ఫ్యాషన్‌పేరిట తెలుగుని ఇంగ్లీషులా, ఇంగ్లీషుని తెలుగులా, అన్నీకలగలిపి కాక్‌టయిల్‌గా మాట్లాడుతూ చాలా అసహజంగా, ఆ భాషలోనే అనాలంటే "ఓ...యే..."(ఓవర్ యాక్షన్)లా అతిఅయి కృత్రిమత్వాన్ని అతికిస్తున్నాయి. ఆ 'ఓ...యే...'లపై ఒక యువ మిత్రుడు తన తరం మాట్లాడుతున్న శైలిని ఆత్మవిమర్శ అనే అద్దం సాయంతో రాసినదే ఈ వ్యాసం.

'సుశ్రీ సరస్వతిగారూ ఎలావున్నారు'... సభ్యతగా రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ పలకరించాను.

'ఒరేయ్ నాకింకా పెళ్ళికాలేదు'... కొట్టినట్టుగా జవాబిచ్చింది.

ఇంతలో పైడిరాజు ఎంటరయ్యాడు. 'సుశ్రీ' అంటే ఇంగ్లీష్‌లో మిస్ అని, శ్రీమతి అంటే మిసెస్ అనీ వివరించాడు.

వాటి అర్థాలు విని సరస్వతి నొచ్చుకుంటూ... "ముజే ఉత్తా తెలుగు సమఝ్ మే నహీ ఆతా" హైదరాబాదీగా జవాబు చెప్పింది.

ఇంత దానికే 'ఒరేయ్...' అని ఆ అమ్మాయి అరవాలా? అని పొరపాటు పడకండి, ఎందుకంటే ఒరేయ్ అంటే గోముగా పిలిచినట్లు!

ఇదేమిటి విడ్డూరం అనుకున్నారంటే... మీరు ఈ మధ్య వస్తున్న యూత్ సినిమాలు చూడట్లేదని అర్థం. ఇప్పుడు కొన్ని ఇంగ్లీష్ పదాలకు కూడా కొత్త అర్థాలు వస్తున్నాయి. ఉదాహరణకి ఎవరైనా 'ఇడియట్' అని అంటే దాని అర్థం "ఐ డు ఇష్క్ ఓన్లీ తుమ్ సే" (నేను నిన్నే ప్రేమిస్తున్నాను) అని అర్థం!. ఇలాంటివే నేటి యూత్ సినిమాలు చూసి నేర్చుకోవచ్చు. ఇవి నేటి విడ్డూరాలలో కొన్ని మాత్రమే.

ఇంతకీ నేనెవరో తెలీదుకదూ... నేను ఈ విశాలాంధ్ర దేశంలో పుట్టి పెరిగిన ఓ అభాగ్య యువకుడిని. నా మాతృభాష తెలుగు. నేను చదువుకున్నది ఇంజనీరింగ్. నేను చదువురీత్యా గత నాలుగు సంవత్సరాలు పొరుగు రాష్ట్రాలకు వెళ్ళాను. తిరిగి వచ్చిన నాకు ఎదురైన ఉగాది పచ్చడి లాంటి అనుభవాలను మీతో పంచుకుంటున్నాను.



హైదరాబాద్ నగరంలోని ఓ ఫంక్షన్ హాల్. నాతో సిబిఎస్ఇ స్కూల్‌లో చదువుకున్న లక్ష్మి పెళ్ళి జరుగుతోంది. లౌడ్‌స్పీకర్‌లో పంతులుగారి మంత్రాలకు బదులుగా 'శ్రీరస్తూ శుభమస్తూ శ్రీకారం చుట్టుకుంది పెళ్ళిపుస్తకం...' అంటూ బాపూగారి పెళ్ళిపుస్తకం సినిమాలోని పాట వినిపిస్తోంది.

పెళ్ళికూతురిహోదాలో ఉన్న నా స్నేహితురాలు టాటా చెప్పింది. దాని అర్థం మా అత్తగారి ఇంటికి వెళ్ళిపోతున్నానోచ్... అనో, లేక దగ్గరికి రావద్దు వెళ్ళిపో అని నాకు సంకేతం ఇచ్చిందనో అనుకుంటే బర్గర్ పిజ్జాల మీద వేసే టమాటా సాస్‌పై మీరు కాలేసినట్టే! ఇదిప్పుడు లేటెస్ట్‌గా మన యూత్ ప్రతిచోటా 'హాయ్' చెప్పే పద్ధతి. నేను కూడా నా స్నేహితురాలికి తిరిగి 'టాటా' చెప్పాను.

ఇంతలో సౌండ్ బాక్స్‌వాడితో ఎవడో గొడవ పడుతున్నాడు. వాడు ఎవడో కాదు, మా వరంగల్ మధుగాడు. మొత్తానికి కష్టపడి పాటల్ని మార్పించేశాడు. ఇహ మొదలైంది పాట... "మసక మసక చీకటిలో..." సెన్సేషనల్ రీమిక్స్ పేరుతో వెస్టన్ బీట్స్‌తో ఖూనీ చేయబడ్డ బ్లాక్ అండ్ వైట్ తెలుగు పాటది. అటు వెళ్ళి గట్టిగా రెండిచ్చా మధుగాడి నెత్తిన.

వాడు కోపంగా 'ఏమ్ మామా ఇప్పుడొచ్చినవ్... పీకలదాకా తిననీకా. లేక మేము తిన్నాక కడగనీకా...' గట్టిగా అడిగాడు.

'మిగిలినోళ్ళు ఏర్రా...' అనడిగా.

'ఈడెందుకుంటరు. మన పోరగాళ్ళు భోజనాలు పెడుతుండ్రు. మన పోరిలేమో బాతాఖానీ పెట్టబట్టే. ఆడికి నడు...' డైనింగ్ హాల్‌కు తీసుకువెళ్ళాడు. అక్కడికి వెళ్ళగానే 'కొంచెం సాంబారు పోసుకోండి అంకుల్' అన్నాడు విజయవాడ రాంప్రసాద్. 'పోసుకోండి ఎట్రా ఎదవ. ఏసుకోండి...' అన్నాడు కోనసీమ రాజుగాడు.

'ఏందిరోరే... పోసుకోరు, ఏసుకోరు గానీ వాళ్ళక్కావలసినవి వాళ్ళు వేసుకుంట్రు. ఖాళీ అయిన సాంబారు బకెట్లు, రైస్ బేసిన్లు వుళ్ళా...ఆటిని సింపండ్రా'... అన్నాడు నెల్లూరు వంశీగాడు.

"అలగేనండి బావ్... సిటంలో నింపేత్తమండీ" అంటూ అప్పల్నాయుడు నవ్వుతూ తన విజ్జీనగరం యాసలో అనీసినాడు.

ఇదంతా చూస్తుంటే, నాకు

ఒక్కసారి ఆంధ్రరాష్ట్రం మొత్తం క్షణంలో చుట్టివచ్చినట్లనిపించింది. భోజనాలు పూర్తి అయ్యాక మా స్కూలు గ్యాంగ్ మొత్తం ఐస్‌క్రీమ్ స్టాల్ వద్ద గుంపుకట్టింది. అప్పుడు మొదలైంది ఒకటే గోల, జోకులు.

ఆ జోకులు ఏంటని ఆసక్తిగా వుందా?... నేనూ రాయాలనే అనుకున్నా. కానీ రాయలేను. ఎందుకంటే అది తెలుగులో మా మధు, రాజు, వంశీగాడు, అప్పల్నాయుడు మాట్లాడిన యాసలు కావు. కానీ అందరం తెలుగులోనే మాట్లాడామనుకుంటా. మరి ఆ యాస ఏంటీ అంటే... అది నేను రాయలేను. రాసినా మీరు చదవలేరు. చదివినా ఆ యాస వంటపట్టదు. అది వినడానికి అల్లూరి సీతారామరాజు సినిమాలో తెల్లదొర రూథర్‌ఫర్డ్‌గా నటించిన జగ్గయ్యగారి యాసలా వుంటుంది. దాన్ని యాస అనాలో, భాష అనాలో అర్థంకాదు. మరి సంభాషణలు ఎలా జరుగుతాయంటే ఏదైనా తెలుగు టీవీ ఛానల్‌లో ప్రతీరోజూ ఉదయంపూట, శని, ఆదివారాల్లో ప్రసారమయ్యే ప్రోగ్రామ్‌లు చూస్తే అర్థం అవుతుంది.

"మాకెంతో ఇష్టమ్మయిన...మీ కార్యక్రమంద్వారా మా చిన్నారికి మొదటి పుటిన్రోజూ... షుబాకాంక్ష్యలు తెల్పాలనీ మా కోర్కె. చెబుతారు కదూ అంటున్నారు. ఈ షుభవేలా...మా ఇంటి బంగారానికి ఎనలేనీ షుబాకాంక్ష్యలు తెలపండీ...!

విన్నావా చిన్నారి(వాడికి ఏడాదే) మీ అమ్మానాన్న (ఇంటిలోనే ఉన్నా) న్నీక్కూ ఎన్నెన్నో ముద్దులు షుబాకాంక్ష్యలు తెల్పుతున్నారు. ఈ షుభ సందర్భమునా మీ అమ్మానాన్న తర్పునా...మీ ఇతరా కుటుంబషభ్యులా తర్పునా...'మీ కోసం' తర్పునా షుబాకాంక్ష్యలు! ఇప్పుడు మీకో కద్పుబ్బ నవ్వించే ఆస్యపు సన్నీవేషం...మీ కోసం! అందిస్తున్నాం."

సినిమాలకు సంబంధించి వివరాలు చెప్పే యాంకర్‌లు కూడా మాట్లాడేది ఇదే భాష. వాళ్ళు మాట్లాడే భాషనుబట్టి వాళ్ళు ఆంధ్రదేశంలో పుట్టి పెరిగి వుండకపోవచ్చని అనిపిస్తుంది. ఈ కొత్త భాషకి తెలంగాణ, కోస్తా, రాయలసీమ అంటూ ప్రాంతీయ భేదాలు లేవు. ఈ తెలుగుభాష హైబ్రీడ్ వైరైటీ. ఇందులో తెలుగుతో పాటు ఇంగ్లీషు, హిందీ వాక్యాలు మిళితమై ఉంటాయి. ఈ భాషని ఇంకా వినాలంటే కాలేజీలు వదలిపెట్టే సమయానికి ఏదైనా ఒక మహా నగరంలో సిటీబస్ ఎక్కాలి. ఎక్కి సరిగ్గా లేడీస్ వెనక సీట్లో కూర్చోవాలి. ఈ మధ్యలో ఇంగ్లీషులో వాడుతున్న హిందీ పదాలకు, హిందీలో వాడుతున్న ఇంగ్లీషు పదాలకు ఎన్ఆర్ఐ బాలీవుడ్ సినిమాలు "హింగ్లిష్" అని నామకరణం చేశాయి. అదే పద్ధతిలో మనం కూడా హిందీ, ఇంగ్లీష్ మిళితమైన ఈ తెలుగుకి "తెహింగ్లీష్"



అనే నామకరణం చేసుకోవచ్చు.

మొన్నామధ్య హైదరాబాద్ సిటీబస్‌లో జరిగిన ఒక సంభాషణ చూద్దాం... ఈ సంభాషణ బస్సు కండక్టర్‌కు, శ్రీకాకుళం జిల్లా నుండి వలస వచ్చిన ఒక భవన నిర్మాణ కార్మికునికీ మధ్య జరిగింది.

"టికెట్... టికెట్... ఏడికి పోవాలే..." కండక్టర్ అడిగాడు.

'యూసఫ్‌గూడాకి రెండు తిక్కట్లియ్యండి..' అంటూ 50 రూపాయల నోటు చేతిలో పెట్టాడా కార్మికుడు.

'చిల్లరివ్వాలే...' కండక్టర్ విసుక్కున్నాడు.

'లేదు బావ్...'

'అయితే దిగు... చిల్లరివ్వాలే. లేకుంటే వేరే బస్సెక్కు...' దబాయించాడు కండక్టర్.

అయితేటి?... అంతదానికే గంట ఎదురుచూసి ఎక్కిన బస్సు దిగిపోమంతారేటి? చిల్లర నేకపోతే దిగేముందియ్యండి... '

'చిల్లరీ... లేకుంటే వేరే బస్సెక్కు'

'ఏటి... ఎర్రిబాగులోళ్లనుకుంతన్నావా యేటి? 50 రూపాయలకి చిల్లర నేదేటి? పొద్దున్నుంచి బస్సు నడుపుతున్నావు. 50 రూపాయలిస్తే, 40 రూపాయలు తిరిగివ్వలేవేటి? మా బాగా సెప్పినావ్. నాను వేరే బస్సు ఎందుకెక్కాల? నానీ బస్సు దిగను. ఊరుకుంటే పెట్రేగిపోతున్నావుగందా. మర్యాదగా మాటాడితే వల్లకాదంతావేటి. యూసఫ్‌గూడాకి రెండు తిక్కట్లివ్వండి'.

'తర్వాత పరేషాన్ చెయ్యొద్దు. నాదగ్గర చిల్లరుంటే ఇస్తా. లేకుంటే లేద్. సంజయిందా? ఇదిగో టిక్కట్లు తీస్కో...'

'ఎందుకియ్యవు చిల్లరీ. ఊరుకుంతానేటి...'

ఈ సణుగుడు కొనసాగుతూనే ఉంది. గొడవ చిన్నది. పెద్దగా విషయం లేదు. కానీ బస్సులో అందరికీ స్పష్టంగా అర్థమైంది. బస్సులో నా తోటివారికే కాదు, తెలుగు మాట్లాడే వారికెవరికైనా చక్కగా అర్థమవుతుంది. ఎందుకంటే ఆ సంభాషణ అచ్చమైన తెలుగు యాసలో జరిగింది కాబట్టి.

ఒక తెహింగ్లీషు సంభాషణ చూద్దామా...

మొన్నామధ్య నా స్నేహితులు మంజుప్రియ, పవన్, నగేష్, అపర్ణ పిజ్జా కార్నర్ వద్ద కలిసినప్పుడు జరిగిన సంభాషణ.

'క్యా నగేష్... వాట్స్ అప్ నవ్వడేస్?' అడిగాడు పవన్.

'ఎయిర్ ఫోర్స్...' జవాబు చెప్పాడు నగేష్.

'నాకు తెలీకుండా ఎయిర్ ఫోర్స్‌లో ఎప్పుడు జాయినయ్యావురా?...' అడిగింది మంజు.

'తుజే ఓబీ నై మాలూమ్... ఎయిర్ ఫోర్స్ అంటే గాలి తిరుగుడన్నమాట... యూ డినాట్ వాచ్ సంతోషమ్ ఫిలిమ్? ఉస్మే సునీల్ కా డైలాగ్ హై ఓ...' జవాబిచ్చింది అపర్ణ.

'జబ్‌సే విప్రో జాయిన్ కరీ. ఉఫ్... నా బతుక్కి సినిమాలు కూడానా?...'

'ఏం అంత బిజీ నా?...' అని మంజుని అడిగా.

'నీకేంబాబూ ఏమైనా చెప్తావ్. ఆజ్‌కల్ సాఫ్ట్‌వేర్ కంపెనీస్ మే సిర్ఫ్ అందర్ జానేకా టైమ్ హమే పతా చెల్తా. బైటికి వచ్చేది... విల్‌బి డిసైడెడ్ బై మై టీమ్ లీడర్'... బాధ వెళ్లగక్కింది మంజు.

'ఇదే నన్నమాట ఐటి రెవల్యూషన్... వెట్టి చాకిరీ, విపరీతమైన అదనపు పనిగంటలు. కానీ జీతాలు మాత్రం ఎనిమిది గంటలకు మాత్రమేనా?...' అని



ప్రముఖ సాహితీ వేత్త భాషావేత్త, తెలుగు సాహితీ ప్రపంచానికి సుపరిచితులు చేకూరి రామారావుగారిని 'ప్రజాశక్తి' కలిసినపుడు భాషాపరమైన మార్పులపై ఆయన వ్యక్తపరిచిన అభిప్రాయాలు.

ప్ర : భాషలో వస్తున్న మార్పుల్ని ఎలా అర్థం చేసుకోవాలి?

జ : సమాజంలో ఏ అంశంలోనైనా జరిగే మార్పులు శాస్త్రీయంగాను, సూత్రబద్ధంగాను జరుగుతాయి. కానీ భాషలో జరిగే మార్పులకు ఒక సూత్రం అనేది ఉండదు.

ప్ర : మరి ఈ మార్పుల్ని ఎలా అర్థం చేసుకోవాలి ?

జ : భాషలో సహజంగా ఒక మార్పు చోటు చేసుకున్నప్పుడు ఆ మార్పును గుర్తించే లోపే మరో మార్పు జరుగుతుంది. కొన్ని కాలంతో జరిగే మార్పులు అయితే మరికొన్ని గ్రాంథిక శైలిలో వచ్చే మార్పులు. ఉచ్చారణా సౌలభ్యం కోసం అనేది భాషాపరమైన మార్పుకి మరో కారణం. ఇలా రకరకాల సిద్ధాంతాలు వచ్చాయి. కానీ సంపూర్ణంగా మార్పును పట్టుకోలేకపోయాయి.

ప్ర : ఒక భాష మరో భాషతో మిళితం అవడం అనేది ఒక భాష మనుగడకు ఏ రకంగా నష్టం కలిగిస్తుంది?

జ : ప్రపంచంలో స్వచ్ఛమైన భాష అనేది లేదు. ఒక ప్రాంతానికి చెందిన వారు మరో ప్రాంతం వారితో సంపర్కించుకొనేంత కాలం భాషలు మిళితం అవుతూనే వుంటాయి. ఎంతో స్వచ్ఛమైన భాష, భాషలకు మూల భాష అని చెప్పుకొనే సంస్కృతంలో కూడా అనేకమైన ద్రవిడ భాషా పదాలు మిళితమై వున్నాయి.

ప్ర : అవసరం లేని చోట ఇతర భాషా పదాలు వాడటం ప్రమాదం అన్నారు. దీనితో ఇంకో ప్రమాదం కూడా వుంది కదా? ముందు తరాలు ఏ ఒక్క భాషనూ పూర్తిగా నేర్చుకోలేరు కదా?

జ : ఈ ప్రమాదం కచ్చితంగా వుంది. అయితే పెద్దగా ఆందోళన చెందాల్సిన విషయం కాదు. స్కూల్స్‌లో టీచర్లు, ఇంటి దగ్గర తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

ప్ర : తెలుగు మాతృభాష కాపాడడానికి వెల్లువెత్తుతున్న సంస్థలకు, ప్రముఖులకు మీ సూచనలు ఏమిటి?

జ : ఇదివరకు చెప్పినట్టే ఏదో కొంతమంది తెలుగును ఇంగ్లీషులాగా మాట్లాడటంతో పెద్దగా జరిగే నష్టం లేదు. దాని గురించి ఆర్భాటంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తెలుగులో పూర్తిగా ఇంగ్లీషు పదాలు వాడకుండా చేయటం అనేది ప్రస్తుత తరుణంలో అసాధ్యం. కాబట్టి స్వచ్ఛమైన గ్రాంథిక తెలుగు మాట్లాడాలి అనేది ఛాందసవాదం అవుతుంది. ఇక్కడ మరో విషయాన్ని మనం గుర్తించాలి. మాట్లాడేటప్పుడు ఇంగ్లీషు పదాల్ని మిళితం చేసినా తెలుగు రాసేటపుడు మాత్రం ఇంగ్లీషు పదాలకు సరిసమానమైన తెలుగు పదాలను వెతుక్కుని మరీ స్వచ్ఛమైన తెలుగులో రాసే ప్రయత్నం చేస్తాం. మరి తెలుగు నాశనం అవుతుందని ఎలా అనగలుగుతాం.

అందర్నీ ప్రశ్నించా.

స్టాప్ లెక్చరింగ్ యార్... షురూ హోగయా!. ఇన్ని రోజుల తర్వాత కలుసుకున్నాం. కాస్త హాయిగా సరదాగా మాట్లాడుకోవచ్చుగా...' అంటూ వెయిటర్‌ను పిలిచి 'నాలుగు మొగలై స్పైసీ జింజర్, పిజ్జాలు, పెస్టిసైడ్ పెప్సికోలాలు...' ఆర్డర్ వేశాడు నగేష్.

ఇదీ తెహింగ్లీష్ సంభాషణ. అక్కడ సంభాషించుకున్న వాళ్లంతా తెలుగువాళ్లే. కానీ తెలుగువాళ్లందరికీ ఈ సంభాషణ అర్థం కాదు. ఎందుకంటే, ఈ సంభాషణ అర్థం చేసుకోటానికి తెలుగుతోపాటు ఇంగ్లీషు, హిందీ కూడా అరా కొరా వచ్చి ఉండాలి. ఈ తెహింగ్లీష్‌లో ముఖ్యంగా జీర్ణించుకోలేని విషయం, తెలుగులో హిందీ, ఇంగ్లీషు వాక్యాలను కలపటం మాత్రమేకాదు, తెలుగు వాక్యాలను కూడా ఇంగ్లీషు వాక్యాలుగా పలకటం.

ఇవ్వటి యూత్ ముద్దు ముద్దుగా మాట్లాడుకోవడం పాష్ (ఆడంబరం)గా ఫీలవుతున్నారు. ఏ టీవీ యాంకర్‌ను చూసినా ఇదే ధోరణి. ఉదాహరణకు "కలర్స్" యాంకర్ స్వాతి, జాహ్నవి మొదలగువారు ఈ బాటనే అనుసరిస్తున్నారు. గత ఏడెనిమిది సంవత్సరాలలో ఈ మార్పు ఎందుకొచ్చిందని ఆలోచిస్తే ఒక కారణముంది. బుల్లి తెర, వెండితెర. అయితే దీనికి తోడు మరో కారణం కూడా వుంది. చదువు, ఉద్యోగ రీత్యా విదేశాలకు వెళ్లి తిరిగొచ్చి బంధు మిత్రుల ముందు డబ్బా కొట్టడం కోసమే అనేదే ఇంకో కారణం. సాధారణంగా విదేశాలకు వెళ్ళిన వాళ్లల్లో ఎక్కువ మంది రెండు మూడు సంవత్సరాలకుగాని తిరిగిరారు. ప్రతిరోజూ ఇంగ్లీషులోనే మాట్లాడటంతో మాతృభాషకు దూరమవుతారు. దాంతో తిరిగి వచ్చినప్పుడు సంభాషణలలో ఒకటి రెండు వారాలు ఇబ్బంది పడతారు. మీతో మేము ఏమాత్రం తీసిపోము. మేమూ మీలా విదేశాల్లో వుండకపోయినా మీకంటె ఎందులోనూ తీసిపోలేదు... అని చాటుకోటానికే నేటి యువత ప్రయాస పడుతోంది. ఈ మార్పు గ్లోబలైజేషన్ పుణ్యమా అని బహుళజాతి ఐటి, ఫుడ్‌చైన్స్, కార్పొరేట్ గుత్త సంస్థలు మనదేశంలో సాగిస్తున్న ప్రగతితో పోటీ పడుతున్నాయన్న విషయాన్ని మనం గమనించాలి. వీటి ప్రభావం తెలుగుతో పాటు ఇతర భారతీయ భాషలపై కూడా ఇదే విధంగా పడుతుంది. విదేశాల్లో ఉండేవాళ్ళకు కూడా అసలు కంటే సోకెక్కువైంది. మీరు ఎవరైనా మీ బంధుమిత్రులు ముఖ్యంగా అమెరికా నుండి తిరిగి వచ్చిన వాళ్లను ఒక ప్రశ్న వేయండి... 'మీరు అక్కడ

ఆ అమ్మాయి పేరు సుమ. పదహారణాల తెలుగింటి ఆడపడుచులా కనిపిస్తుంది. టీవీ ఉన్న ప్రతి ఇంటికీ సుపరిచితురాలు. ఈ అమ్మాయి మాతృభాష మలయాళం అని తెలిస్తే మనలో చాలామంది బిత్తర పోతారనడంలో ఆశ్చర్యం లేదు. చక్కటి తెలుగు మాట్లాడుతుంది. తెలుగు కార్యక్రమాలకు మకుటంలేని యాంకరింగ్ రాణిగా తనకంటూ విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకున్న సుమతో తెలుగు గురించి...

ప్ర : మలయాళం మాతృభాషయిన మీరు ఇంత చక్కటి తెలుగు ఎలా నేర్చుకున్నారు?

జ : చిన్నప్పుడు నాకు అస్సలు తెలుగువచ్చేదికాదు. మేము హైదరాబాద్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో ఉండేవాళ్ళం. మా కాలనీలో తమిళులు అధికంగా ఉండేవారు. నేనే తమిళం, మలయాళం మిళితమైన తెలుగు మాట్లాడే దాన్ని. కానీ, టీవీ పరిశ్రమలో అడుగు పెట్టినాక తెలుగు నేర్చుకోవలసిన అవసరం పెరిగింది. తెలుగు సెకండ్ లాంగ్వేజిగా తీసుకున్నాను. తెలుగు రాయటం, చదవటం పట్టుదలగా నేర్చుకున్నాను.

ప్ర : పరిశ్రమ కోసం అయితే ఇతర భాషల తారల మాదిరిగా డబ్బింగ్‌పై ఆధారపడొచ్చుగా?

జ : తెలుగు బాగా నేర్చుకోవాలనే పట్టుదల నాకు రావటానికి కారణం, మరొకరితో డబ్బింగ్ చెప్పించుకోవటం ఇష్టం లేకపోవటమే. యాంకరింగ్‌కు ముఖ్యమైన విషయాలు స్పాట్‌లో క్రియేటివిటీ. దానికి భాషపై పట్టు చాలా అవసరం.

ప్ర : తెలుగు నేర్చుకోవటానికి మీరు ఇబ్బంది పడ్డారా?

జ : లేదు. తెలుగు చాలా సింపుల్ అండ్ స్వీట్ లాంగ్వేజ్. మా అబ్బాయి తన మాతృభాష మలయాళం మర్చిపోకూడదని నేను అప్పుడప్పుడు వాడితో మలయాళంలో మాట్లాడే ప్రయత్నం చేసినా వాడు తెలుగులోనే నాకు జవాబులిస్తుంటాడు.

ప్ర : యాంకరింగ్‌కు ముఖ్యమైన అంశం?

జ : భాష. ఎందుకంటే యాంకరింగ్‌కు డబ్బింగ్ అవకాశం ఉండదు.

ప్ర : మన తెలుగు యాంకర్లు ఇంతగా వెస్ట్రనైజ్ అవ్వటానికి కారణాలు?

జ : ఛానల్స్ పెరుగుతున్నాయి. యాంకర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రోగ్రామ్స్‌లో కొత్తదనం కోరుకుంటున్నారు. ఈ కోరిక వారికంటూ ఒక స్టైల్‌ను క్రియేట్ చేసుకోవాలనే వైపు దారితీస్తుంది.

ప్ర : తెలుగు భాషలో వేరే భాష యాస మిళితం చేయటం స్టైల్ ఎలా అవుతుంది?

జ : ప్రోగ్రామ్ డైరెక్టర్లు యాంకరింగ్ ప్రోగ్రామ్‌లు క్రియేట్ చేసేటప్పుడు హిందీ, ఇంగ్లీషు ప్రోగ్రామ్‌లను అనుకరిస్తున్నారు. అసలు ఏ ప్రోగ్రామ్ రూపమైనా ప్రోగ్రామ్ డైరెక్టర్ చేస్తారు. భాషాపరమైన ఈ మార్పులకు కూడా యాంకర్ల కంటే ప్రోగ్రామ్ డైరెక్టర్లే కారణం.

ప్ర : లైవ్ టాక్ షోలకు స్క్రిప్ట్ ఉండదుగా. ఆ ప్రోగ్రామ్‌లలో డైరెక్టర్ల భాషాపరమైన ఒత్తిడి యాంకర్లపై ఉండదుగా?

జ : ప్రతి యాంకర్ ఒకటి కంటే ఎక్కువ ప్రోగ్రామ్‌లు చేస్తున్నారు. ఈ ప్రోగ్రామ్ కంటే మరొక ప్రోగ్రామ్ డిఫరెంట్‌గా ఉండాలి. ఈ ఒత్తిళ్ళ మూలంగా యాంకర్లు తమకంటూ ఒక స్టైల్‌ను ఏర్పరుచుకుంటున్నారు. అవే భాషాపరంగా స్టైల్స్‌గా ఏర్పడుతున్నాయి. ఈ రోజు వస్తున్న యూత్ సినిమాల ప్రభావం కూడా యాంకరింగ్‌పై విపరీతంగా పడుతోంది.

ప్ర : మరి తెలుగు ఔన్నత్యాన్ని ఎలా కాపాడుకోవాలి?

జ : ఆ మధ్య తెలుగు భాషా పరిరక్షణకు సంబంధించి ఒక పెద్దాయన పెద్దభాషణ ఇచ్చి చివర్లో "థాంక్స్" అన్నారు. వీటిని అరికట్టటం అసాధ్యం. అయితే మనం మన రూట్స్‌ను మర్చిపోకూడదు. ముఖ్యమైన మార్పు ఛానల్స్‌లోనే రావాలి. తెలుగు స్పష్టంగా మాట్లాడుతూనే నేను సక్సెస్ అవుతున్నాను. స్వచ్ఛమైన భాషకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది.

తెలుగు మాట్లాడతారా?'.

'మాకక్కడ ఎదురయ్యే ప్రతీ మూడో వ్యక్తీ తెలుగువాడే. పనిచేసే దగ్గర తప్ప మామూలుగా మాట్లాడుకునేది తెలుగులోనే...' అనే జవాబు సహజంగా వినిపిస్తుంది. ఎక్కడో అమెరికాలో ఉన్నప్పుడు మాట్లాడే తెలుగుకి, తెలుగునాడుకు వచ్చే సరికి ఏం జరుగుతుందో?... ఎంత ఆశ్చర్యం!.

కోటేశ్వరరావు అంకుల్ కొడుకు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్నాడు. అందులో అది సిబిఎస్ఇ సిలబస్ కావడంతో వాడికి తెలుగు సబ్జెక్ట్ వుండదు. వాడు ఇప్పటి సొసైటీకి భిన్నంగా ఆంటీ, అంకుల్‌ని పిన్నీ, బాబాయ్ అనీ, మమ్మీ డాడీకి బదులుగా అమ్మా, నాన్నా అని పిలవటం చూసి ఆశ్చర్యపోయాను. వాడు తెలుగులో రాయడం, చదవడం చూసి బిత్తరపోయా. వుండబట్టలేక వాడిని అడిగేశా. 'శ్రీనాథ్... నీ ఫ్రెండ్స్ మోడరన్‌గా మమ్మీ, డాడీ అని పిలుస్తుంటే నీవేంటి అమ్మా, నాన్నా అని పిలుస్తున్నావ్?'

"అన్నయ్యా... ఈజిప్టు దేశీయులు దాచుకున్న వాళ్ళ రాజుల శవాలని మమ్మీస్ అంటారు. మరి అమ్మను అలా పిలవమంటావా? అని నన్ను ఎదురు ప్రశ్నించే సరికి నాకు సిగ్గేసింది. మా నాన్నగారి స్నేహితులను కమ్మగా మామయ్యా అని పిలవడం బదులుగా అంకుల్ అని పిలిచే నా నిస్సహాయతపై నాకే జాలేసింది.

శ్రీనాథేకాదు..., సరస్వతికి ఇంగ్లీష్ టు తెలుగు... తెలుగు టు ఇంగ్లీషు డిక్షనరీగా వ్యవహరించిన పైడిరాజుకయితే చదువులేదు. మరి మాతృభాషపై పట్టు సాధించిన పైడిరాజా లేక, సరస్వతా? ఎవరు అసలైన గ్రాడ్యుయేట్? ఇది నేడు మనం తెల్సుకోవలసిన విషయం.

మాతృభాష ఉన్నతి, విశిష్టత పెంచడానికి ఒక కమిటీని వేసి పెద్ద ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వాలకు, మేధావులకు నాతోటి యువతీ యువకులకు ఒక మనవి... మన దైనందిన జీవితంలో వాడుతున్న కొన్ని ఇంగ్లీష్, హిందీ పదాలు వాడకుండా మనం వుండలేం. పెన్నును కలం అని, పేపర్‌ను కాగితం అని అనమనే వాళ్ళే దానిని పాటించలేరు. దీనిని మనం అర్థం చేసుకోవాలి. అయితే మన భాష ఉచ్ఛారణలో వున్న తియ్యదనాన్ని మనం కాపాడుకోవాలి. దీని సంప్రదాయాలను, విశిష్టతను రక్షించుకొనే ప్రయత్నం చేయాలి. హైబ్రీడ్ తెహింగ్లీష్‌కు స్వస్తి చెప్పాలి. కొత్త ఆవకాయలాంటి ఉచ్ఛారణతో తెలుగును పలుకుతూ ఇతరులను అటువైపుగా ప్రోత్సహించాలి. ఇది నాతోటి యువతీ యువకులు గ్రహించిననాడే తెహింగ్లీష్‌కు మంగళం పాడగలం. భాష నిజమైన ఎదుగుదలకు, చక్కనైన మార్పులకు ఆహ్వానం పలకగలం. ✤

శత్రుత్వాలు

జయంతి పాపారావు

రోజూ వేపచెట్టు దగ్గరకు వెళ్తున్నాను.
రామదాసు బతికున్నాడో లేడో చూస్తున్నాను.
ఆ పని అనుకోకుండా అదనంగా నా మీద పడింది!

వేప చెట్టు నాకు తెలుసు. దాని ఎదుగుదల నాకు తెలుసు. ఏభై ఏళ్ళ నుండి చూస్తున్నాను. దాన్ని ఎవ్వరూ వేయలేదు. దానంతట అదే మొలిచింది. మొక్క అయింది. దాన్ని చలపతి మాస్టారు చూశారు. వెదురు కర్రలూ, ముళ్ల కంపలూ తెచ్చి దానిచుట్టూ కంచె వేశారు. రోజూ ఉదయం నీళ్ళు పోస్తూండేవారు. అది పెద్దదవుతోంది. శత్రుత్వాలు ఎవరికీ తప్పవు. మేకలూ, పశువులూ లాగేసి కొరికేస్తూ వుండేవి. అయినా అది చలపతి రక్షణలో పెద్దదయింది. మేకలకూ, పశువులకూ అందకుండా ఎదిగిపోయింది. అయితే–మనిషికి అందనిది ఏదీవుండదు! పళ్ళు తోముకోడానికి పుల్లల కోసం విరిచేస్తూ వుండేవాళ్ళు. అంతలో చలపతి పదవీ విరమణ చేసేశారు. తెల్లవారుజామునే అక్కడికివెళ్ళి కూర్చుంటూండేవారు. పుల్లలు విరవకుండా చూస్తుండేవారు. ఆ విధంగా ఆ చెట్టు చాలా పెద్దదయింది. ఆ వీధికి విశ్రాంతి స్థలం అయింది. పిల్లలకి ఆటస్థలం అయింది. ఆ వీధికి ఆనందాన్నీ ఆరోగ్యాన్నీ ఇస్తోంది.

* * *

చలపతి ఇల్లు అక్కడికి చాలా దగ్గరగా వుంది. జాగా బాగా పెద్దదే అయినా, ఇల్లు చాలా చిన్నది. రెండు గదుల ముప్పై గోడల ఇల్లు. వెదుళ్ళతో తాటి చెక్కలలో తాటి కమ్మలతో నేసిన ఇంటికప్పు. ఆయన జీవితమంతా ఇంట్లోనే గడిచిపోయింది. పేదరికంలోనే వెళ్ళిపోయింది.

చనిపోయే ముందురోజున, రోజంతా వేపచెట్టు కిందే గడిపారు. వేపచెట్టు గాలి పీలుస్తూ తుదిశ్వాస విడిచిపెట్టేశారు. చెట్టు మిగిలింది. ఆయన పోయారు. ఆ చెట్టులో చలపతి సజీవంగా కనిపిస్తారు. ఎందుకంటే – నిర్మాణశీలతలో మనిషి మరణం తరువాత కూడా జీవిస్తాడు!

ఆయన మరణం తరువాత ఆ ఇల్లు ఆయన కొడుకు ముత్తేలబాబు చేతుల్లోకి వెళ్ళిపోయింది. వేపచెట్టు ముష్టివాడి చేతుల్లోకి వెళ్ళిపోయింది.

* * *

ముష్టివాడు నాకు తెలుసు. అతడి పెరుగుదల నాకు తెలుసు. ఏభై ఏళ్ళ నుండీ చూస్తున్నాను. అతడు ఏ ఎదుగుదలనూ ఆశించలేదు. ఎదుగుదల కోసం ఏ పనీ చేయలేదు. అతడి ఎదుగుదల వయసులో మాత్రమే వుంది.

చలపతి ఇంటి జాగాలో వెనుకవైపున ఓ మర్రిచెట్టు వుంది. అది వీధిలోకి కూడా బాగా విస్తరించేసింది. ముష్టివాడు ఆ నీడన నివాసం ఏర్పర్చుకున్నాడు. ఆ చెట్టు చలపతి ఇంటి మీదికి కూడా బాగా విస్తరించేసింది. రోడ్డు మీదకు కూడా ఎంతో విస్తరించేసింది. ముష్టివాడికి తన పుట్టుక తెలీదు. పేరు తెలీదు. సాధువుల సత్రంలో పెరిగాడు. సాధువులని పిలవబడే ముష్టివాళ్ళ చేతుల్లో పెరిగేడు. తల్లిదండ్రులెవరో తెలీదు. ఓ సాధువు చదువు చెప్పేడు. రామదాసు కీర్తనలు నేర్పాడు. తెలుగు బాగా నేర్పేడు. బాల్యం అలా గడిచాక, స్వతంత్ర జీవనం కోసం బయటకు వచ్చేశాడు. మర్రిచెట్టు కింద స్థిరపడ్డాడు. రామదాసు కీర్తనలు పాడుతూ, ఇల్లిల్లూ తిరుగుతూ, ముష్టి ఎత్తుకుంటూ బతుకు ప్రారంభించేడు. ఆ తరువాత రామదాసుగా అతడి పేరు స్థిరపడిపోయింది.

ఓ రోజున చలపతి రామదాసుని పిల్చేరు.

'రామదాసూ! మర్రిచెట్టు బాగా విస్తరించేసింది. నాకే కాకుండా వీధి ప్రజలందరికీ ఇబ్బందిగా తయారైంది. అనారోగ్యాన్ని కలిగిస్తోంది. అంతేకాకుండా, రోడ్డు మీద నడిచేవాళ్ళ నెత్తి మీదా బట్టల మీదా పక్షులు రెట్టలు వేస్తున్నాయి. ప్రజలు బాధపడుతున్నారు. రోడ్డు పక్కన వేసిన ఏ మంచి మొక్కలూ బతకడం లేదు. మా ఇంటి జాగాలోనూ అంతే. మర్రిచెట్టు తన జాగే తను చూసుకుంటుంది. తన ఎదుగుదలనే తను చూసుకుంటుంది. ఇతర మొక్కల్ని బతకనీదు! ఎదగనీదు! ఇబ్బందిగా హానికరంగా తయారైంది! నరికించేద్దామనుకుంటున్నాను...'

'మీ ఇష్టం! మీ చెట్టు!' అని రామదాసు రెండే రెండు మాటలు చెప్పేడు. తన సామానంతా తీసుకొని వెంటనే వేపచెట్టు దగ్గరకు వెళ్ళి, ఇటూ అటూ చూసి, ఆ చెట్టు కింద నివాసం ఏర్పర్చుకున్నాడు.

చలపతికి మతిపోయినట్లయింది. ఏమి చేయాలో తోచలేదు. వెంటనే రామదాసు దగ్గరికి వెళ్ళాడు. 'రామదాసూ! వేపచెట్టు ఎందరికో మంచిగాలి, చల్లని నీడ ఇస్తోంది. వీధి ప్రజలు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటున్నారు. పిల్లలు ఆడుకుంటున్నారు. అందరికీ ఉపయోగపడుతోంది. నువ్వు ఇక్కడ చేరిపోయావు! ఎందరికో ఇబ్బంది అవుతుంది! అందరికీ ఉపయోగ పడకుండా పోతుంది! నీ ఒక్కడికే ఉపయోగపడేలా తయారవుతుంది! ఆలోచించుకో!'



"ఎవరి పీకలో కోసేసో, ఎవరి ఆస్తులో కబళించేసో నేను ధనవంతుణ్ణి కాలేదు. అలా చేస్తే, అది వ్యక్తి శత్రుత్వం అవుతుంది. కార్పొరేటివ్ వ్యవస్థ వేరు! ముఠా వ్యాపారం! ముఠా దోపిడీ! ప్రత్యేకించి ఏ వ్యక్తినో కాకుండా, వారి వారి అవసరాల ఆధారంగా, వ్యవస్థలోని అవకాశాలూ, లోపాలూ ఆధారంగా, అందర్నీ దోచుకోడం! ప్రభుత్వధనం - ప్రజాధనం - ప్రజలనూ - దోచుకోడం! అటువంటప్పుడు, వ్యక్తి శత్రుత్వాలకు తావులేదు! వర్గ శత్రుత్వం ఉంటుంది! దానివల్ల నాకు ఏ ఇబ్బందీ లేదు!'

అని చలపతి చెప్పేరు.

'ఇది వీధి చెట్టు! ఇది అందరిదీనూ! నీకెంత హక్కువుందో నాకూ అంతే హక్కు వుంది! శుభ్రంగా ఉంచాలని నాకు తెలుసు! నువ్వెళ్ళు! నీ పని చూసుకో!' అని రామదాసు కసిరేడు. చేయగలిగిందేమీ లేక చలపతి విషాదంగా ఇంటికి వెళ్ళిపోయాడు.

* * *

చలపతి పోయాక, రామదాసు ఆ చెట్టు తనే వేసి పెంచి పెద్దది చేసినట్లు అందరికీ చెప్తున్నాడు. నమ్మిస్తున్నాడు. పిల్లల్ని ఆడుకోడానికి రాకుండా అడ్డుకుంటున్నాడు. దేవుడి బొమ్మలూ, విగ్రహాలూ పెట్టి ఏవేవో పూజలు చేస్తున్నాడు. పెద్దలు కూడా రాకుండా తయారుచేశాడు. ఆ చెట్టుని తనదిగా చేసేసుకున్నాడు.

ఇంటింటా తిరుగుతూ ముష్టి ఎత్తుకుంటాడు. నాటుసారా తాగుతూ రామదాసు కీర్తనలు ఉత్తేజంగా పాడుతాడు. ఆడవాళ్ళను తెచ్చుకుంటూ వుంటాడు. కొంతకాలం వుంచుకొని పంపించేస్తూ వుంటాడు. ఆ సమయంలో నాటుసారా బాగా తాగుతూ చాలా ఉత్తేజంగా మధురంగా రామదాసు కీర్తనలు పాడుతాడు. నాటుసారాకి తోడు ఆడది కూడా వుండడం వల్ల తన్మయత్వంలో ఎంతో ఉత్తేజంగా మధురంగా పాడుతాడు.

* * *

చలపతి కొడుకు ముత్తేలబాబు నాకు తెలుసు. బాల్యం నుండీ నాకు తెలుసు. ముత్తేలబాబుకి చదువులో చురుకుదనం లేదు. పనుల్లో మాత్రం పరమపదునుగా వుండేవాడు. చలపతి ఆశించినట్లుగా అతడు పెరగలేదు. చలపతి బాధపడుతూ వుండేవారు. అతికష్టం మీద బి.ఏ. పూర్తి చేశాడు.

విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంటు పనులు ప్రారంభమయ్యాయి. మరో రెండు పెద్ద ప్రభుత్వరంగ సంస్థలు రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రైవేటు సంస్థలూ-పెట్టుబడిదారీ వర్గాలూ-విశాఖకు రావడం మొదలైంది. భూమి ధర బాగా పెరుగుతూ వస్తోంది. ముత్తేలబాబు బయట నుండి వచ్చిన కొందరు పెద్ద వ్యాపారులతో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ఐదుగురు కలిసి సంస్థగా ఏర్పడ్డారు. ముత్తేలబాబు అందులో ఒకడిగా చేరేడు. తండ్రి మిగిల్చిన ఇంటి జాగాలో కొంత అమ్మేసి ఆ సంస్థలో వాటాదారునిగా చేరేడు. కాంట్రాక్టు పనులు మొదలెట్టారు. లాభాలు బాగారావడం మొదలైంది.

కొంతకాలం పోయాక, ముత్తేలబాబు మిగిలిన జాగాలో సినిమా హాలూ, మందుల షాపూ, చిన్న విశ్రాంతి భవనం కట్టించేడు. ఊరికి దూరంగా చవగ్గా జాగాకొని సొంత ఇల్లు కట్టించుకున్నాడు.

సినిమా హాల్లో సినిమా లాభాలే కాకుండా, నీలి బొమ్మల లాభాలు బాగా వస్తున్నాయి. మందుల షాపులో నకిలీ మందుల లాభాలే కాకుండా, అక్రమ మద్యం వ్యాపారం లాభాలు పండిస్తోంది. విశ్రాంతి భవనంలో జూదాలూ, వ్యభిచారాలు, లాభాలు కురుస్తున్నాయి. ఆ విధంగా ముత్తేలబాబు పెద్ద ఆస్తిపరుడయ్యాడు. కోట్లు సంపాదిస్తున్నాడు.

కొత్త తరానికి కొత్త రాజకీయాలు కావాలని ముత్తేలబాబు గుర్తించేడు. అప్పట్లో సంచలనాత్మకంగా వచ్చిన కొత్త రాజకీయ పార్టీలో చేరిపోయాడు. రాజకీయవ్యవస్థ విలువలను కోల్పోయి వ్యాపారంగా మారిపోయింది. ముత్తేలబాబు రాజకీయ వ్యాపారంలో పదునుగా పనిచేస్తున్నాడు. లాభాలనొల్లుకుంటున్నాడు. కాదుకాదు. కొల్లగొడుతున్నాడు.

చలపతి ఆశించింది వేరు. ఆ తరం వేరు. ఆ తరం వెళ్ళిపోయింది. ముత్తేలబాబుల తరం వచ్చేసింది. మన రాజకీయ సామాజిక వ్యవస్థను ముత్తేలబాబులే నడుపుతున్నారు. 'డబ్బు సంపాదించాలి. కష్టపడకుండా తేలిగ్గా సంపాదించాలి. తక్కువ కాలంలో కోట్లుకోట్లు కొల్లగొడుతూ కూడబెట్టాలి. ఆధిపత్యం రావాలి. ఇదే ముత్తేలబాబుల వర్గాన్నీ, తరాన్నీ నడుపుతోంది.

ఆ విధంగా బాగుపడ్డవాళ్ళు, తమ బాగుని చూసి సంతోషించేవాళ్ళూ వుండాలని కోరుకుంటారు. ముత్తేలబాబు కూడా అంతే. అందుకోసం అప్పుడప్పుడు వచ్చి నన్ను కలుస్తూ వుంటాడు.

* * *

ఓ సంవత్సరం అవుతోంది. ముత్తేలబాబు ఏదో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నాడు. అయితే - ఏమీ చెప్పలేదు.

ఈ మద్దిన ఓసారి నా దగ్గరకు వచ్చేడు. శత్రుత్వాల గురించి కొద్దిగా మాట్లాడేడు.

'శత్రుత్వాలు ఎందుకు ఎలా వస్తాయో తెలీదు! ఏదో శత్రుత్వం నన్ను క్రూరంగా వేటాడుతోంది?

'మీ సంస్థ దోపిడీలు చేస్తోంది! నువ్వు ప్రజల బలహీనతల్నీ, నిస్సహాయతనూ డబ్బుగా మార్చుకుంటున్నావు! శత్రుత్వం లేకుండా ఎలా వుంటావ్?!'

"ఎవరి పీకలో కోసేసో, ఎవరి ఆస్తులో కబళించేసో నేను ధనవంతుణ్ణి కాలేదు. అలా చేస్తే, అది వ్యక్తి శత్రుత్వం అవుతుంది. కార్పొరేటివ్ వ్యవస్థ వేరు! ముఠా వ్యాపారం! ముఠా దోపిడీ! ప్రత్యేకించి ఏ వ్యక్తినో కాకుండా, వారి వారి అవసరాల ఆధారంగా, వ్యవస్థలోని అవకాశాలూ, లోపాలూ ఆధారంగా, అందర్నీ దోచుకోడం! ప్రభుత్వధనం - ప్రజాధనం - ప్రజలనూ - దోచుకోడం! అటువంటప్పుడు, వ్యక్తి శత్రుత్వాలకు తావులేదు! వర్గ శత్రుత్వం ఉంటుంది! దానివల్ల నాకు ఏ ఇబ్బందీ లేదు!'

'రాజకీయ వ్యాపారానికి సంబంధించిన దోపిడీ ఏమో? ఆ దోపిడీ శత్రుత్వంగా మారిందేమో?'

'కాదు! అది చాలా రహస్యంగా జరుగుంది! అది తెలీడం అంత తేలికకాదు! తెలిసినా బయట పెట్టడానికి భయపడతారు! అదికాదు!'

'అలా కాకపోతే అసూయ కావొచ్చు!'

'అదికాదు! అసూయ మానవ బలహీనత! అది చిన్న శత్రుత్వమే కానీ, బలమైన శత్రుత్వం కాజాలదు! ఏడుపే ఉంటుంది! అవకాశం దొరికితే దెబ్బతీస్తారు! అంతే!'

'ఆశ్చర్యంగా వుంది?!'

"అందుకే మీతో చెప్పుకుంటున్నాను, ఏం చేయాలో తెలీడం లేదు. ఆ శత్రుత్వం ఎందుకో తెలీడం లేదు.' అలా కొంతసేపు శత్రుత్వం గురించి మాట్లాడేక, స్నేహాల గురించి కూడా కొద్దిగా మాట్లాడి వెళ్ళిపోయాడు.

* * *

ఓ రోజు సాయంత్రం ముత్తేలబాబు మా ఇంటికి వచ్చాడు. 'మంచి సినిమా వచ్చింది. మా హాల్లో ఆడుతోంది. కొంతసేపు తీరిగ్గా మాట్లాడుకుందాం. ఆ తరవాత సినిమా చూద్దాం. రండి!' అని నన్ను తీసుకెళ్ళేడు.

విశ్రాంతి భవనంలో బాల్కనీలో కూర్చున్నాం.

'చాలా రోజులైంది. నిద్ర పట్టడం లేదు. శత్రుత్వాన్ని భరించలేకపోతున్నాను. క్రూరంగా హింసిస్తోంది. మనసుకి స్థిమితం లేకుండా పోతోంది. భయంభయంగా వుంటోంది. మంచి మద్యం సేవించినా నిద్రరావడం లేదు. పరస్త్రీలతో సుఖిస్తున్నా నిద్రరావడం లేదు. ఏం చేస్తున్నా శత్రుత్వమే కళ్ళముందు కదుల్తోంది. ఏం చేయాలో తెలీడం లేదు' అని అన్నాడు.

అంతలో ఎదురుగా వేపచెట్టు కింద రామదాసు మావేపు చూస్తూ నిటారుగా నిలబడ్డాడు. ముత్తేల బాబువేపు వేలు చూపిస్తూ సారా మత్తులో ఊగిపోతూ గంభీరంగా కేకలు వేస్తున్నాడు.

'చలపతి బాబు ఏం చేశాడు?! చెడ్డేకాని మంచి చేయని మర్రిచెట్టును నరికించేశాడు! పదిమందికి పనికొచ్చే వేపచెట్టును పెంచి పెద్దది చేశాడు! అయితే - నువ్వేంటి? మర్రి చెట్టులా ఎదిగిపోతున్నావు! నీకూ నాకూ తేడా ఏంటి? ముష్టోడికీ నీకూ తేడా ఏంటి? ఇద్దరూ పరుల కష్టాన్ని కాజేస్తూ బతుకుతారు! అంతేకాదు, నీలాటోడు పరులను దోచుకుంటూ మర్రిచెట్టులా ఎదిగిపోతాడు! ముష్టోడు నేరాలు సెయ్యడు! నీలాటోడు సెయ్యని నేరవంటూ ఏటీ వుండదు! నువ్వెంతో గొప్పోడివని ఎందుకను కుంతున్నావ్? ఎలగ అనుకుంతన్నావ్? నేనే నీకంటే గొప్పోణ్ని! నేనే నీ కంటే మంచోణ్ని! నేనూ, నువ్వూ - నాలాటోళ్ళూ, నీలాటోళ్ళూ - ప్రజలకు శత్రువులం! నేను చిన్న శత్రువుని! నువ్వు పెద్ద శత్రువువి!'

ఆ విధంగా రామదాసు నాటుసారా మత్తులో రంకెలు వేస్తూ, తెలుగు బాగా రావడం వల్ల తడుముకోకుండా గంభీరంగా కేకలు వేశాడు.

ముత్తేలబాబు మౌనంగా వుండిపోయాడు. అతణ్ని హింసిస్తున్న శత్రుత్వం ఏంటో తెలిసిపోయింది! అతడు ప్రజాశత్రువు కావడమే అతణ్ని హింసిస్తున్న శత్రుత్వం అని నాకు చెప్పాల్సిన అవసరం లేకుండా పోయింది!

* * *

రోజూ వేపచెట్టు దగ్గరకు వెళ్తున్నాను. రామదాసు బతికున్నాడో లేదో చూస్తున్నాను. ఆ పని అనుకోకుండా అదనంగా నా మీద పడింది! ✤



బాల్యం మధురం

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

మాలిని ఆదిత్యను తీసుకొని లోపలికి వచ్చింది.

"ఏంది ఆదిత్యకు ఈ రోజు సెలవా?" అడిగాన్నేను.

"అవును ఆంటీ! వాడు స్కూలుకు వెళ్ళకపోతే ఒకటే అల్లరి చేస్తాడు. ఇల్లు పీకి పందిరి వేస్తాడు. సామానంతా నీటుగా సర్దలేక ఛస్తున్నాను. కాసేపు ఈ ఆట అంటాడు. కాసేపు ఆ ఆట అంటాడు. అంతేకాదు నన్ను ప్రశ్నలతో విసిగిస్తాడు. నాకు క్విజ్ పెడ్తుంటాడు. వీడితో ప్రాణం విసిగిపోయి ఇక్కడికి తీసుకొచ్చాను. వీడు ఎప్పుడు పెద్దవాడవుతాడో ఏందో!" చాల అలసిపోయి విసిగిపోయినట్లుగా కన్పించింది మాలిని. ఆదిత్య వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ మెషీన్ ముక్కలను సైజులు వెతికి వెతికి జోడించటంలో మునిగిపోయి వున్నాడు.

"ఏమిటి మాలినీ వాడు ఎవరి జోలికీ పోకుండా వాడి మానాన వాడు ఆడుకుంటున్నాడు కదా! నువ్వెందుకు పరేషాన్ అవుతావు" అన్నాన్నేను...

"అదో చూడు ఆంటీ! ఆ సామానంతా ఇంటినిండా పరిచేస్తాడు. అవన్నీ సర్దాలా వద్దా? - చెప్పండి. అవన్నీ సర్దలేక నడుం నొప్పితో ఛస్తున్నాను. వీడు ఎప్పుడు పెరిగి కాలేజీలో అడుగు పెడ్తాడో ఏమో! అప్పటికి ఇంజనీరింగు చదువులు ఏమైతాయో? వీడు చదివి ఇంజనీరుగా బయటికి వచ్చేసరికి ఉద్యోగాలు దొరుకుతాయో లేదో? వీడికి విదేశాలకు పోయే ఛాన్స్ దొరుకుతుందో లేదో? ఇప్పటికే వీసాలియ్యటం తగ్గించేశారట మనవాళ్ళకు. వీడు తొందరగా పెరిగి పెద్దవాడైతే బాగుండును!" అంది మాలిని. ఆమె టెన్షన్ చూసి నాకాశ్చర్యమైంది. ఆదిత్యకు పదేండ్లయినా లేవు. అప్పుడే వాడి ఉద్యోగం విదేశాల గురించి మాలినికి టెన్షన్. మాలిని మళ్ళా మొదలుపెట్టింది.

"ఆదిత్యకీ మధ్య ట్యూషన్ పెట్టించాను ఆంటీ! వాడి క్లాసులో అందరికీ ట్యూషన్లు వున్నాయట. మరి వాడికి ట్యూషన్ లేకపోతే వెనుకబడిపోతాడేమోనని స్కూలు కాంగానే ట్యూషన్‌కు పంపిస్తున్నాను" అంది మాలిని గబగబ.

"అయినా ఇన్ని రోజులు ట్యూషన్ లేకున్నా ఆదిత్య మంచిగానే చదువుతున్నాడు గద మాలినీ! అనవసరంగా ట్యూషనెందుకు. ఇంతకుముందు స్కూలు నుంచి వచ్చిం తర్వాత బయట గ్రౌండులో పిల్లలతో ఆడుతూ కన్పించేవాడు. ఇప్పుడు కన్పించటం లేదు ఎందుకా అనుకుంటున్నాను. కారణం ట్యూషన్ అన్నమాట!"

"లేకపోతే ఆంటీ! వాడి క్లాసులో అందరికీ మార్కులు బాగా వచ్చేస్తే వీడు వెనుకబడిపోతాడని భయమైంది ఆంటీ! ట్యూషన్ పెడితే మంచిదే కదా... కాసేపు వీడి అల్లరైనా తప్పుతుంది" నవ్వింది పేలవంగా మాలిని.

"పిల్లలు అన్న తర్వాత అల్లరి చేస్తారు. ఆడుకుంటారు. ప్రశ్నలడుగుతారు. జిజ్ఞాస చూపిస్తారు. ఆటలు పాటలు ప్రశ్నలతోనే గదా వాళ్ళ మేధస్సు పెరుగుతుంది. వాడు ఎప్పుడు పెద్దయిపోతాడా? - అని నీకెందుకు తొందర మాలినీ! ఏ వయస్సులో పిల్లలు ఏం చేస్తారో చూసి తల్లి ఆనందించాలి. కాని విసుగుతో ఎప్పుడు పెరిగి మిగతా వాళ్ళలా ఉద్యోగంలో ఎప్పుడు చేరుతాడో, విదేశాలకు పోతాడా లేదా అని తొందరపడటం చింతపెట్టుకోవటం ఏ బాగాలేదు మాలినీ! పిల్లల ఆటలు, చిలిపి చేష్టలు, వాళ్ళు ముద్దుముద్దుగా అడిగే ప్రశ్నలు, మాటలు విని ఆనందించాలి. నీకు తెలిసిన సమాధానాలు చెప్పాలి. పిల్లల్ని నేర్చుకునేట్లుగా చేయాలి. కాని ఎప్పుడు పెరిగి పెద్దవాడవుతాడో అని టెన్షన్లో వుంటే ఎట్లా? బాల్యం మధురమైంది అంటారు. నిజంగానే బాల్యంలో పిల్లల చిలిపిచేష్టలు, ఆటలు మాటలు, వాళ్ళు క్రమక్రమంగా పెరిగే విధం మనల్ని ఆనందంలో ముంచెత్తుతాయి. పిల్లల ప్రతి మెట్టును చూసి మనం ఆనందించాలి. మళ్ళా ఆ రోజులు వెనక్కురావు. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయి పెళ్ళిళ్ళు చేసుకొని స్థిరపడిం తర్వాత అయ్యో వాళ్ళను నేను చిన్నప్పుడు సరిగ్గా చూసుకోలేకపోయానే అని బాధపడ్డ వాళ్ళు చాలామంది వుంటున్నారీ కాలంలో. అంటే పెరిగే కాలంలో తొందరగా పెరిగి పెద్దవాళ్ళయిపోతే బాగుండును అనుకుంటారు. తర్వాత పిల్లల బాల్యాన్ని గురించి తలచుకొని మిస్ అయ్యామే అని బాధపడ్తూంటారు. అట్లాకాక పిల్లల ప్రతి చేష్టలను, మాటలను చూసి విని ఆనందించాలె మాలినీ!" అన్నాన్నేను. పెద్ద లెక్చరే ఇచ్చాను నేను. మాలిని ఆలోచనలో పడిపోయింది కాస్సేపు.

"ఆంటీ! మీరనేది నిజమేనేమో. మా చిన్నప్పుడు సాయంత్రాలు, వెన్నెల రాత్రుల్లో పిల్లలమంతా ఒక్కచోట చేరి ఎన్నో ఆటలు ఆడేవాళ్ళం. అటువంటి బాల్యం ఇప్పటి పిల్లలకు కరువే అయింది. ఎప్పుడూ చదువులు, పరీక్షలు, ట్యూషన్లు అని వాళ్ళ తలకాయలను తినేస్తున్నాం. ఆడుకోనియ్యటం లేదు" అంది మాలిని విచారంగా.

"ఇంట్లో సామాను చిందరవందర చేస్తున్నారంటే పిల్లలు ఆటవస్తువులను ఎదజల్లుతారు. అది సహజమే. కాని చిన్నప్పట్నుంచి తమ ఆట వస్తువులను ఆడుకున్న తర్వాత ఒక్కచోట జాగ్రత్తగా పెట్టుకునే క్రమశిక్షణ వాళ్ళకే నేర్పాలి. అంతేగాని నా నడుం విరిగిపోతుందని విసుక్కొని, వీడు ఎప్పుడు పెరిగి పెద్దవాడైపోతాడా అని తొందరపడితే ఎట్లా! వీడు పెరిగే సరికి అవకాశాలు ఏమైపోతాయో అని విపరీతమైన టెన్షన్ పెట్టుకొని నువ్వు ఆదిత్యను శాంతిగా, సంతోషంగా ఉండనియ్యటం లేదు. నువ్వూ సంతోషంగా, శాంతిగా ఉండటం లేదు. ఈ హైపర్ టెన్షన్‌తో నువ్వు వాడు చేసే పనులేవీ చూసి ఆనందించటం లేదు. మెచ్చుకోవటం లేదు. అది ఆదిత్య మనస్సును పాడుచేస్తుంది. నీ తొందరతో వాడి బాల్యాన్ని హరించి పాడు చెయ్యకు మాలినీ!" అన్నాన్నేను. నా మాటలు మాలిని మనసుకు ఎక్కినట్లుగానే అనిపించింది. ✤

పిల్లల ఆటలు, చిలిపి చేష్టలు, వాళ్ళు ముద్దు ముద్దుగా అడిగే ప్రశ్నలు, మాటలు విని ఆనందించాలి. నీకు తెలిసిన సమాధానాలు చెప్పాలి. పిల్లల్ని నేర్చుకునేట్లుగా చేయాలి. కాని ఎప్పుడు పెరిగి పెద్దవాడవుతాడో అని టెన్షన్లో వుంటే ఎట్లా? బాల్యం మధురమైంది అంటారు. నిజంగానే బాల్యంలో పిల్లల చిలిపిచేష్టలు, ఆటలు మాటలు, వాళ్ళు క్రమక్రమంగా పెరిగే విధం మనల్ని ఆనందంలో ముంచెత్తుతాయి. పిల్లల ప్రతి మెట్టును చూసి మనం ఆనందించాలి.

రామచిలుక నవ్వింది

అరసవిల్లి కృష్ణ

అవంతీ దేశపు రాజు విశ్వగుప్తుడు. ఆయనకు రామచిలుకలంటే చాలా ఇష్టం. చాలా అంటే ఎంతంటే... దేశంలోని ప్రజలందరూ రామచిలుకలను పెంచాలనే ఆజ్ఞ కూడా జారీ చేసేంత. దేశంలో ఏ మూలకు వెళ్ళినా రామచిలుకలు గుంపులు గుంపులుగా కన్పించేవి. ఆకాశంలో రామచిలుకలు, ఎగురుతుంటే చిలకపచ్చ ఆకాశంలా వుండేది.

రాణి రేవతీదేవికి కూడా రామచిలుకలంటే ఇష్టం. రాజభవనంలో వాటిని ప్రేమగా పెంచుతుండేది. రామచిలుకలతో ముద్దుముద్దుగా మాట్లాడుతూ, చిలుకలకూ మాట్లాడటం నేర్పేది. విశ్వగుప్తుడు కూడా రేవతీదేవితో కలిసి రామచిలుకలతో కాలక్షేపం చేసేవాడు.

ఓ రోజు విశ్రాంతిమందిరంలో విశ్వగుప్తుడు రామచిలుకలతో సంభాషిస్తున్నప్పడు, రాజభటుడు కంగారుగా మందిరంలోకి ప్రవేశించాడు.

కంగారుపడుతున్న భటుణ్ణి గమనించి, విశ్వగుప్తుడు 'ఏం జరిగింది?' అని అడిగాడు.

'రాజా! దేశంలోని, రామచిలుకలన్నీ, ఒకేసారి పగలబడి నవ్వుతున్నాయి. ప్రజలంతా ఈ వింతను చూచి ఆశ్చర్యపడుతున్నారు. గుంపులు, గుంపులుగా వీధులలోకి వచ్చి, రామచిలుకల వింత చేష్టల గురించి మాట్లాడుకుంటున్నారు' అన్నాడు భటుడు.

విశ్వగుప్తుడు తల ఎత్తి పంజరంలోని రామచిలుక వంక చూశాడు. రాజు ముఖం వంక చూచిన రామచిలుక బిగ్గరగా నవ్వడం ప్రారంభించింది.

రాజు గోముగా 'ఎందుకలా నవ్వుతున్నావ్?' అని అడిగాడు. రామచిలుక కాసేపటి తర్వాత నవ్వడం ఆపి 'రాజా! ఓ రోజు దేశంలోని పంట పొలాల్ని, పక్రృతి సౌందర్యాన్ని చూచేందుకు మా గుంపంతా వెళ్ళాం. కాని మాకెక్కడా పచ్చదనం కనబడలేదు. ఎండిన పొలాలు దర్శనమిచ్చాయి. రైతులందరూ పొలం గట్లపై దిగులుగా కూర్చొని వున్నారు. రైతుల దీనస్థితిని చూచి, రాత్రంతా ఏడ్చాం. ఈ దేశంలో రామచిలుకలను ప్రేమగా పెంచుతారు. కాని పచ్చని పంట పొలాలకు వర్షం ఆధారం. ఈ దేశంలో చాలాకాలంగా తగినంత వర్షం కురవడం లేదు' అంది రామచిలుక ఆవేదనగా.

'వర్షం కురవకపోవడానికి పంటలు పండకపోవడానికి తగిన కారణం కన్పించడం లేదు' అన్నాడు విశ్వగుప్తుడు.

'మీకు కన్పించని కారణం, మీకు తెలియని విషయం ఒకటుంది మహారాజా. ఈ దేశంలో వృక్షసంపద లేదు. రామచిలుకలమంతా ఆకాశంలో ఎగురుతున్నప్పడు ఏదయినా చెట్టుపై కాసేపు విశ్రాంతి తీసుకుందామన్నా ఒక్క చెట్టు కూడా లేదు. ఈ దేశంలో రామచిలుకల్ని పెంచుతున్నారు. మంచిదే కాని చెట్లను పెంచడాన్ని వృథాగా భావిస్తున్నారు మహారాజా!

ఏ దేశమైతే చెట్లను పెంచటంలో నిర్లక్ష్యం చేస్తుందో ఆ దేశం తీవ్రమైన కరువు కాటకాలలో చిక్కుకుంటుంది. ఈ బాధ్యతను ప్రభువులకు గుర్తు చేద్దామనే.... దుఃఖాన్ని దాచుకొని, నవ్వుతూ మీ బాధ్యతను గుర్తు చేస్తున్నాం' అంది రామచిలుక.

రామచిలుక చెప్పినదాన్ని విశ్వగుప్తుడు శ్రద్ధగా ఆలకించాడు. వెంటనే మహామంత్రిని పిలిచి దేశంలోని పౌరులంతా ఓ రామచిలుకతో పాటు ఓ చెట్టును కూడా పెంచాలనే చాటింపు వేయమని ఆజ్ఞాపించాడు.



బాలనేస్తాలు

రంగులు అద్దుదాం!

హలో...హలో.... నేస్తాలూ! మీకోసం ఇవాళ ఓ టక్కరి పిల్లి వచ్చిందర్రా! దాని వేషం, అమాయకత్వం చూసి మోసపోకండి. అది మీకు రంగురంగుల బూరలు ఇచ్చినట్టు ఇచ్చి మీ చేతిలో వున్న చాక్లెట్‌ను కొట్టెయ్యాలని చూస్తోంది. మీరేం చేస్తారంటే... మెల్లగా క్రేయాన్లు తీసి దానికి రంగులు అద్దేయండి. అప్పుడు ఆ పిల్లి భయపడి గమ్మున ఉండిపోతుంది. సరేనా! ఇదంతా రహస్యంగా జరిగిపోవాలి. ఆ...!

వి'చిత్రం'

చిన్నారులూ...! ఇవాళ్టి వి'చిత్రం'లో ఓ తమాషా వుంది. 'ఆ...మీరేం చెప్పొద్దులే. ఆ కుక్క దర్జాగా ఇంటి యజమాని బట్టలు వేసుకుని డ్రస్సింగ్ టేబుల్ ముందు నిలబడి చూసుకుంటోంది. దాంతో యజమానురాలికి కోపం వచ్చి చేత్తో కొట్టబోతోంది. అంతేకదా' అంటున్నారు కొందరు నేస్తాలు. కానీ... నేస్తాలూ! తమాషా ఏంటంటే... యజమానురాలి భర్త కూడా ఈ బొమ్మలోనే వున్నాడు. మీరు కాస్త ఓపిగ్గా, పట్టుదలతో ప్రయత్నిస్తే ఆయన కూడా కనిపిస్తాడు. 'ఏంటి అలా నీరసంగా చూస్తున్నారు. ఆయన కనిపించలేదా. అయితే మేమే చెప్పేస్తాం.



జవాబు

నేస్తాలూ! ఇలాగైతే ఎలాగర్రా! ఎదురుగ్గా వున్న మనిషి కనపడడంలేదంటారేంటి. కళ్లకు పని పెట్టాలి. బుర్రతో ఆలోచించాలి. ఇవేమీ మీరు సరిగ్గా చేసినట్టులేరు. అందుకే ఆయనగారు కనిపించలేదు. ఇప్పటికైనా మించిపోయినదేమీ లేదు. పుస్తకం తిరగేసి చూడండి. కుక్క వీపు మీద యజమాని తల వుంది. సరిగ్గా కుక్క మెడ దగ్గర యజమాని గెడ్డం వుంది. అవునా. ఇప్పుడేమంటారు? మీ పరిశీలనాశక్తిని మరింత పెంచుకోవాల్సి వుంది కదూ. వచ్చేవారం మరో మంచి వి'చిత్రం'తో మీ ముందుంటామే!

*

చిన్నారి చిత్రకారులు



ముద్దాడ రాంబాబు,
10వ తరగతి,
నంత బొమ్మాళి,
శ్రీకాకుళం.



కొమ్మలపాటి చరిత, 5వ తరగతి,
సెయింట్‌పాయిస్ గర్ల్స్‌స్కూల్, రామ్‌నగర్, హైదరాబాదు.



జె.ఉమారాణి,
సుందరయ్యనగర్,
మిర్యాలగూడ.

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి వండులో ఎవరొచ్చారో చెప్పకోండి. ఏంటి ఎంత ఆలోచించినా తెలీడంలేదల్లే వుందే. కానీ కొందరికి కాస్త తెలిసినట్టుంది. సరే. మేం కొన్ని ఆధారాలు చెప్తాం. వాటిని బట్టి ఫొటోలో వున్నదెవరో చెప్పాలి. సరేనా. ఈమె మంచి కవయిత్రి 'బేంగిల్ సెల్లర్స్' అనే పోయమ్ రాసింది ఈవిడే. అంతేకాదు. ఈమెకు'గాన కోకిల' అనే బిరుదు కూడా వుంది. ఏంటి? ఇప్పుడు చెప్పగలరా? అయితే కార్డుమీద రాసి ఇవాళే ఇప్పుడే పోస్టుచేయాలి. మరి మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

<u>సరైన సమాధానాలు రాసినవారు</u>

ఆలిబల్లి సంపత్‌కుమార్, 7వ తరగతి, నర్సాపురం, ప.గో. డి.గాయత్రి, 9వ తరగతి, ఖానాపురం, ఖమ్మం. వై.రాజేశ్వరి, 10వ తరగతి, ప్రతిభానికేతన్, విజయనగరం. వై.దినేష్‌బాబు, 4వ తరగతి, ప్రగతి బాలవిద్యాలయం సుందరయ్యనగర్. ఎస్.మనోజ్‌కుమార్, 9వ తరగతి, ఎస్ వెంకట్రాపురం, విశాఖ. ఎ.ప్రసాద్, 8వ తరగతి, పాలకొండ, శ్రీకాకుళం. కాలువ శ్రీ తన్మయ, 2వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. అల్లూరి హేమంత్, 9వ తరగతి, దామరమడుగు, నెల్లూరు. వి.సౌమ్య, 5వ తరగతి, వి.రాజావంశీధర్, 7వ తరగతి, ఈమని. పి.రాజేష్, 9వ తరగతి, పి.స్వరూప, 10వ తరగతి, ఈమని. బి.వసంతకుమారి, 8వ తరగతి, లక్ష్మీనగర్, మెదక్.

గతవారపు సమాధానం:
సివి.రామన్





వాహనాలు

```
        R T I N U
      C K E L A T I E
    C K V T C   W A S
  S W N T A H     E R W
Z Q H H X E S       N T S
S W U F Y H E       S I K N A T P
I I T O O Q L L V S S R T R H D O L K D
M R T E R Z V E I F D Q O I N C A L W J V
U W C C W E R J A A A L D V N V N A M L E D
Q Z D P G A L O C O I A G E D E W I M J C P
A X E R C X O P E B O M Q V U M L R C L Y W
T A L W Z F M I P N O P Z E X P A H T U L H
U C G T T B I I O Y G K G Z G K I G Q P J
  A R A Y                   Q X Z E
    Z F                       J B
```

ఇంగ్లీషు పజిల్-13

హాయ్ పిడుగులూ! ఇవాళ పజిల్ కారు ఆకారంలో వుందేంటా? అని ఆలోచిస్తున్నారా! మరదే. మీరు ఇలా ఆలోచించాలనే అలా ఇచ్చాం. ఈ కారు ఆకారంలో వున్న అక్షరాలలో కొన్ని వాహనాలు, వస్తువులు వున్నాయి. అవన్నీ ఇంధనంతోగానీ, కరెంటుతోగానీ నడుస్తాయి. అవేంటో కనుక్కోవాల్సింది మాత్రం మీరే. వెంటనే కనిపించకపోయినా కాస్త ఓపిగ్గా వెతికి జవాబులు రాయాలి. మీకు విక్రమార్కుడికి వున్నంత పట్టుదల వుందని మాకు తెలుసులే. మరి ఓకేనా! మీ సమాధానాలకోసం ఎదురుచూస్తుంటామని మర్చిపోవద్దే. మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

<u>**పజిల్ - 11కు సమాధానాలు రాసినవారు**</u> (పేరు పక్కన వున్న నెంబరు వారు గుర్తించిన పదాల సంఖ్య)

డి.అక్షయ్ కుమార్ (14), 4వ తరగతి, జనగామ. **బి.పాండురంగారావు** (9), 10వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **సి.వీర వెంకట రమణమూర్తి** (16), 9వ తరగతి, భువనగిరి. **కె.కాంచన** (10), 5వ తరగతి, కంకటపాలెం.

పజిల్-12 సమాధానం

Sea	Happy
Hat	Boat
Sub	Time
Mess	Water
Mom	Love
Dad	Sad

బ్యాగ్ చేసేద్దాం

హాయ్ నేస్తాలూ! పోయినవారం పిగ్గీ చేసేసినట్టున్నారే. మీ గదిలో గోడలకు కూడా తగిలించేశారా! వెరీగుడ్. ఈ వారం మీకోసం బోన్ బ్యాగ్ వచ్చింది. అంటే... మరేదో అనుకోమాకండి. ఎముక ఆకారంలో వుండే సంచి ఎలా చెయ్యాలో చెప్పకోబోతున్నామన్నమాట. అబ్బో! చిన్నారులు తెగ సంతోషపడిపోతున్నారే. ఇది చెయ్యడం చాలా చాలా సులభం. బ్యాగ్ చెయ్యడానికి ఏమేం కావాలంటే... మందపాటి చార్టు, మంచి పెన్సిల్, స్కేలు, కత్తెర, సూది, దారం, చొక్కాగుండీ. ఎలా చెయ్యాలంటే... ముందు మీకు ఎంత బ్యాగ్ కావాలో నిర్ణయించుకోండి. దాన్ని బట్టి ఆ సైజులో మూడు (3) వేయండి. తర్వాత బొమ్మలో చూపించిన ఆకారం గీసుకోండి. అంతే కుక్క ఎముక (3వ బొమ్మలోలాగా) రెడీ. తర్వాత అంతే సైజుది 4వ బొమ్మను గియ్యండి. ఇప్పుడు మీరేం చెయ్యాలంటే.... 5వ బొమ్మలో చూపించినట్టుగా ఆ రెంటినీ (3,4 బొమ్మలు) కలిపి కుట్టండి (కాకపోతే నాల్గవ బొమ్మలో చూపించిన కాగితం అడుగున వుండాలి). ఇప్పుడు సంచి ఓపెనర్‌కు అటూ ఇటూ దారంగాని, ఊలుగాని ముడివెయ్యండి. ఆ దారం ఎంత పొడవుగా వుండాలంటే మీరు భుజానికి తగిలించుకుంటే చేతి వేళ్లకు బ్యాగ్ తగిలేట్టు వుండాలి. చివరిగా ఓపెనర్‌పైన చక్కటి గుండీ కుట్టండి. అంతే. బ్యాగ్ రెడీ.

ఇలా మీరు రంగు రంగుల కాగితాలతోను, బట్టలతోను కూడా చెయ్యొచ్చు. కాకపోతే సూదితో కుట్టేటప్పుడు, కత్తెరతో కత్తిరించేటప్పుడు పెద్దవాళ్ల సాయం తీసుకోవాలి.





కీర్తి పతాక

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

యువతరం ఉత్సాహం ఉరకలు వేస్తోంది.

దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అమ్మాయిలు, అబ్బాయిలు గుంపులు గుంపులుగా అక్కడ సంచరిస్తున్నారు. తమలో నిబిడీకృతమైన కళలను వెలికితీయడానికి ఉత్సాహపడుతున్నారు.

కేరళలో తిరువనంతపురంలో ఆ ప్రాంగణమంతా రంగురంగుల పతాకాలతో రెపరెపలాడుతోంది. ఆడిటోరియం పరిసర ప్రాంతాల్లో అందంగా చేసిన అలంకరణ చూసేవారిని ఎంతో ఆకట్టుకుంటోంది.

విద్యార్థినీ, విద్యార్థులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నారు. కొంతమంది తమలో తామే హమ్మింగ్ చేసుకుంటుండగా మరికొంతమంది తబలా, గిటార్ వంటి వాద్య పరికరాలను వాయిస్తూ అటూఇటూ తిరుగుతున్నారు.

జాతీయ యువజనోత్సవాల హడావుడి ఎక్కువగా వుంది.

ఈలోపు కార్యక్రమం ప్రారంభం అవుతున్నట్లుగా నిర్వాహకులు ప్రకటించారు. అందరూ లోపలికి వెళ్ళి సీట్లలో ఆశీనులయ్యారు. యువజనోత్సవాల్లో వివిధ అంశాలను ప్రదర్శించే యువతరంగం మాత్రం స్టేజి వెనుక గ్రీన్‌రూం వైపు వెళ్ళిపోయారు.

వాతావరణం ఉత్సాహంగా ఉంది.

అమ్మాయిలు ఆధునిక వస్త్రధారణతో నవ్వుతూ తుళ్ళుతూ ఆ ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఇంతలో కార్యక్రమం మొదలైంది.

పెద్దగా ఉపన్యాసాలు లేవు.

క్లుప్తంగా కార్యక్రమం ముగించిన తర్వాత ఆ రోజు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు, అందులో పాల్గొనే వారి పేర్లు ప్రాంతాలతో సహా నిర్వాహకులు ప్రకటించారు.

సాంస్కృతిక ప్రదర్శన ఆరంభమైంది.

కేరళ రాష్ట్రంలో జనం పండుగలో ప్రదర్శించే సాంప్రదాయకమైన నృత్య ప్రదర్శనను కొంతమంది బాలికలు అద్భుతంగా ప్రదర్శించారు. తర్వాత ఆధునిక నృత్యం, నృత్య రూపకం తమిళనాడు రాష్ట్రీయులు ప్రదర్శించారు.

ఆంధ్రప్రదేశ్ కార్యక్రమమని నిర్వాహకులు ప్రకటించారు.


సితార్ వాయిద్యంతో కీర్తి

మెదడు వాపు వ్యాధి సోకక ముందు కీర్తి

తెరతీయగానే సితార్‌తో ఓ యువతి ప్రత్యక్షం అయ్యింది. ఆమెకు ఇరువైపులా సహాయకులు తబలా, తంబురా వంటి వాద్య పరికరాలతో కూర్చున్నారు.

తర్వాత ఆమె సితార్ సరిచేసుకున్నారు.

అంతవరకూ రకరకాల కార్యక్రమాలతో ఎంతో సందడిగా వున్న ఆ ఆడిటోరియంలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన యువతరమంతా ఆ కార్యక్రమం కోసం ఆసక్తిగా ఎదురుచూశారు.

సితార్ వాద్య కార్యక్రమం మొదలైంది.

ఆమె సితార్ మీటే విధానం, అందులోంచి జాలువారుతున్న పాటల పల్లవి విని వచ్చినవారు మంత్రముగ్ధులయ్యారు. వరుసగా ఇరవై నిమిషాలపాటు కొనసాగిన ప్రదర్శన యువతరాన్ని ఓలలాడించింది. అంతవరకూ జరిగిన అంశాలకు భిన్నంగా జరిగిన ఈ కార్యక్రమం ఎంతోమందిని ఆకట్టుకుంది. రకరకాల వస్త్రధారణలతో నృత్యం చేయడం, పాశ్చాత్య వాద్యపరికరాలతో అర్థం తెలియని పదాలతో పాటలు పాడటం విన్న ఎంతోమందికి ఆ సితార్ వాద్యవిన్యాసం గొప్ప రిలీఫ్ అనిపించింది.

తర్వాత నిర్వాహకులు ఫలితాలు ప్రకటించారు.

యువజనోత్సవాల్లో పాల్గొనాలని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందలాదిమంది యువతీ యువకులు ఫలితాల పట్ల ఉత్సాహం చూపించారు.

సంగీత నృత్య ప్రదర్శనల విభాగంలో మొదటి బహుమతి కీర్తికి ప్రకటించారు. సితార్‌తో సంగీత సముద్రంలో ముంచి తేల్చిన అమ్మాయిని నెమ్మదిగా వేదికపైకి తీసుకుని వచ్చారు.

మానవ వనరుల మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఆమెకు బహుమతి ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నిజామాబాద్ ప్రాంతానికి చెందిన కీర్తి వివరాలను ఆమె సాధించిన విజయాలను వివరించారు. ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఆమె ఎన్నో రంగాల్లో ఎంత కృషి చేసిందో తెలిపారు. అంధత్వం అడ్డురాకుండా ఆమె పడిన శ్రమ, చేసిన కృషి చెబుతూ బహుమతి ప్రదానం చేశారు.

అంతవరకూ ఆమెను గొప్ప విద్వాంసురాలిగా గుర్తించిన వారు, ఆమె కళ్ళు లేకుండా ఇంతటి సాధన చేశారని తెలుసుకుని చప్పట్లు కొట్టారు. అప్పటివరకూ మౌనసముద్రంలా ఉన్న ఆ ఆడిటోరియం చప్పట్లతో హోరెత్తింది.

నిజామాబాద్ ఆదర్శనగర్‌కు చెందిన కీర్తి చిన్నతనంలోనే కాలానికి ఎదురీదింది. నృత్యంలో ఆమె ప్రావీణ్యం సంపాదించి, బాల్యంలోనే ఎన్నో ప్రశంసలు పొందింది. అనుకోని పరిస్థితుల్లో కీర్తికి అంధత్వం ప్రాప్తించింది. అయినప్పటికీ ఆమె నిరాశ పడలేదు.

చిన్న వయసులో బుడిబుడి అడుగులు వేసే సమయంలోనే కీర్తి నాట్యం పట్ల ఆసక్తి పెంచుకుంది. తన నృత్య ప్రదర్శనలతో చూసేవారిని మంత్రిముగ్ధుల్ని చేసేది. ఆమె కృషి, పట్టుదల తల్లిదండ్రులకు కూడా ఎంతో ముచ్చట కలిగించేది. శాస్త్రీయ పద్ధతిలో నృత్యాన్ని నేర్పించడానికి వారు కూడా ఉత్సాహాన్ని చూపించారు. ఫలితంగా ఆమె అతి చిన్న వయస్సులోనే ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి చేరుకుంది.

నిజామాబాద్‌లో ఏ సంస్థ ఎటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినా కీర్తి నృత్యం ఉండవలసిందే.

ఆరు సంవత్సరాల వయసులో కీర్తికి మెదడు వాపు వ్యాధి సోకింది. తల్లిదండ్రులు తమకు తెలిసిన వైద్యులు అందరి వద్దకూ తీసుకువెళ్ళారు. రకరకాల పరీక్షలు చేయించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. వ్యాధి విషమించి కోమాలోకి వెళ్ళిపోయింది. కీర్తి కోలుకోవడం చాలా కష్టమని వైద్య నిపుణులు ప్రకటించారు.

తమ ముద్దుల మూట, గారాల పట్టి మంచానికి అతుక్కుపోవడం తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. ఎంతో కృషి చేశారు. రకరకాల మందులను వాడారు. స్పెషలిస్టులను సంప్రదించారు.

వైద్యుల కృషితో కీర్తి కోలుకుంది. ప్రాణాపాయం నుంచి తప్పుకుంది. అయితే మెదడు వాపు వ్యాధి తీవ్రత కారణంగా కీర్తి చూపును కోల్పోయింది. ఆరేళ్ళ వయస్సులోనే శాశ్వత అంధురాలిగా

మారిపోయింది. అంతవరకూ అందమైన ప్రపంచాన్ని చూసిన ఆమె కళ్ళముందు నల్లటి తెర శాశ్వతంగా కప్పబడిపోయింది.

తనకు మరి కళ్ళు కనిపించవని తెలుసుకున్న కీర్తి దుఃఖంలో మునిగిపోయింది. మూసిన ఆమె కళ్ల నుంచి రోజూ కన్నీటిబొట్లు కిందికి కారేవి. "అమ్మా! నేను మరి నిన్ను చూడలేనా?" అని ఆమె అడుగుతుంటే తల్లి సమాధానం చెప్పలేక తాను కూడా ఏడుస్తూ అక్కున చేర్చుకొనేది.

తన వయస్సు వాళ్ళు చదువుకుంటున్నారని తెలిసి ఎంతో బాధపడేది. తనకూ అటువంటి అవకాశం లేకపోయింది కదా అని కుమిలిపోయేది.

బాల్యంలో ఆమె మానసిక స్థితిని తండ్రి అర్థం చేసుకున్నాడు. ఆమెలో నిరాశను పారద్రోలాలని నిర్ణయించుకున్నాడు.

రోజూ కనీసం అయిదారు గంటలు కీర్తితో గడిపేవాడు. "అంధత్వం ఒక వైకల్యం కాదు. దానిని అధిగమించిన వారున్నారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలి?" అనేవాడు.

"ఎలా నాన్నా?" కీర్తి ప్రశ్నించేది.

"సాధారణ మనుషులు చేయలేని పనులు నువ్వు చేయగలవు. నీకు ప్రత్యేక జ్ఞాననేత్రం ఉంటుంది. దాంతో నువ్వు అన్నీ ఊహించగలవు" అనేవాడు.

తండ్రి మాటలను కీర్తి ఆసక్తిగా వినేది.

"డాన్సు అంటే నీకు ఇష్టం... సంగీతాన్ని ప్రేమిస్తావు... ఈ రంగంలో నువ్వు కృషి చెయ్యి. తప్పకుండా గుర్తింపు వస్తుంది. గుర్తింపుకన్నా నీకు ఒకలాంటి ఆత్మతృప్తి కలుగుతుంది. అటువంటి తృప్తి నీకు గొప్ప ధైర్యాన్ని ఇస్తుంది. ఆ ధైర్యంతో నువ్వు దేన్నయినా సాధించగలవు" కీర్తి ఉత్సాహానికి తండ్రి పదేపదే ప్రోత్సాహాన్ని ఇచ్చేవాడు.

తండ్రి మాటలు... ఆయన కలిగిస్తున్న ఉత్సాహం కీర్తిలో పట్టుదలను పెంచాయి. ఏదైనా సాధించాలి. అందరిలో ప్రత్యేకత చూపించాలి అనుకొనేది. అందుకు తగినవిధంగా తల్లిదండ్రుల సహకారంతో కృషి ప్రారంభించింది.

* * *

కీర్తి ఇంటిలోనే బ్రెయిలీ లిపి నేర్చుకుంది.


జిల్లా అధికారుల పురస్కారాన్ని అందుకుంటూ

ఇందుకోసం తల్లిదండ్రులు ఆమె కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రోజు అరగంట నుంచి ప్రారంభించి అయిదారు గంటల వరకూ నేర్చుకునే సమర్థతను చాటుకుంది. తనకు అవసరమైన అన్ని పాఠ్యాంశాలను బ్రెయిలీలో నేర్చుకుంది.

తాను ప్రాణంగా భావించే సంగీతం, నృత్యం విషయంలో ప్రత్యేకంగా కృషి చేసింది. సితార్ వాద్యంపై దృష్టి సారించింది. నిజామాబాద్ బాలభవన్‌లో సితార్ వాద్యంపై శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని అక్కడికి వెళ్ళింది. కీర్తిలో ఉత్సాహాన్ని చూసి వారు చేర్చుకుని శిక్షణకు శ్రీకారం చుట్టారు. ప్రాథమికంగా సితార్ గూర్చి అవగాహన పెంపొందించుకుంది. ఈ వాద్యంలో చాలా తక్కువ మంది కృషి చేశారని తెలిసి అందులో ప్రావీణ్యం సంపాదించుకోవాలని నిర్ణయించుకుంది.

నిజామాబాద్‌లో ప్రాథమికమైన అవగాహన శిక్షణ పూర్తయిన తర్వాత 1989లో సికింద్రాబాద్ భక్తరామదాసు సంగీత కళాశాలలో చేరింది. సితార్ వాదన్‌లో నాలుగు సంవత్సరాల పాటు నిర్వహించే కోర్సును పూర్తి చేసి సర్టిఫికెట్‌ను పొందింది.

ఇంటర్మీడియెట్ వరకూ నిజామాబాద్ కళాశాలలో విద్యను అభ్యసించిన కీర్తి హైదరాబాద్ కస్తూరిబాయి కళాశాలలో బి.ఏ. డిగ్రీ పూర్తి చేసింది. చదువు విషయంలో తన కృషి కొంతవరకు అయినా సాఫల్యం అయిందని కీర్తి సంతృప్తి పడింది. చదువుతో పాటు ఆమె సంగీత సాధనను ఎప్పుడూ మరిచిపోలేదు.

నిజామాబాద్ బాలభవన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నిర్వహించిన యువజన వారోత్సవాల్లో విజేతగా నిలిచింది. అప్పటి గవర్నర్ రంగరాజన్ నుంచి పురస్కారాన్ని పొందింది. తిరువనంతపురంలో సంగీత ప్రదర్శనకు కేరళ ముఖ్యమంత్రి ఎ.కె. ఆంటోని చేతుల మీదుగా సన్మానాన్ని అందుకుంది. ఢిల్లీలో ఇచ్చిన ప్రదర్శనకు అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్‌శర్మ కూడా కీర్తికి జ్ఞాపికను అందజేశారు.

ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా అందులో తప్పనిసరిగా పాల్గొనాలని కోరుకునే కీర్తికి వెళ్ళిన ప్రతిచోటా విజయమే ఆహ్వానాన్ని పలికేది. సంగీతంలో ఆమె ప్రావీణ్యాన్ని ప్రతి ఒక్కరూ మెచ్చుకునే వారే. కృషి చేస్తే ఎవరైనా ఎటువంటి విజయం అయినా సాధించగలరని ఆమె జీవితం నిరూపించింది. మూడేళ్ళ ప్రాయం నుంచి ముప్పయ్యేళ్ళ ప్రస్థానం వరకూ జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ కళాకారిణిగా ఉన్నత శిఖరాలనే అధిరోహించింది.

* * *

'జిల్లా సహకార కేంద్ర బ్యాంక్, నిజామాబాద్'

బోర్డు చూసి లోపలికి ప్రవేశించాడు పాంచజన్య.

జర్నలిస్టుగా ఎంతోమందికి సంబంధించిన మానవీయ జీవన కథనాలను ఆయన తన పత్రిక్కి రాస్తుంటాడు. సాధారణ వార్తల కన్నా ఇటువంటి కథనాలు రాయడంలో అతనికి ఎంతో ఆసక్తి.

కీర్తి గురించి ముందు విన్నాడు. తర్వాత కొంతమంది వద్ద తెలుసుకున్నాడు. ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన ఆమె కథను పత్రిక ద్వారా తెలియజేయాలని నిర్ణయించుకున్నాడు. కీర్తి సాధించిన విజయాల వివరాలను సేకరించాడు.

పదిహేనేళ్ళుగా ఆమె చేస్తున్న కృషి ఫలించింది.

సహకార బ్యాంకులో ఉద్యోగిగా చేరింది. అంధురాలైనా ఆమె అర్హత, సమర్థత కారణంగా ఉద్యోగం లభించింది.

ముందుగా ఫోనులో మాట్లాడినందువల్ల పాంచజన్య పెద్దగా పరిచయం చేసుకోలేదు. కీర్తి అతడ్ని ఆహ్వానించింది. ఎదురుగా కూర్చుని కెమెరా ఉన్న బ్యాగ్‌ను పక్కన పెట్టాడు.

"మీరు నన్ను ఇంటర్వ్యూ చేస్తామన్నారు. కానీ నేను అంత గొప్పదానిని కాదు. నేను చేసిన కృషిని కృషి అని కూడా అనుకోవడం లేదు. అటువంటిది ఎవరైనా చేయగలరు!" ఉపోద్ఘాతంగా కీర్తి చెప్పింది.

పాంచజన్య నవ్వుతూ – "విజయాలు సాధించిన ప్రతివారూ ఇదే విధంగా అంటారు. మీ ప్రత్యేకత మీకు తెలియకపోవచ్చు. కానీ ఎంతోమందికి మాత్రం ఆదర్శనీయం.."

తర్వాత పాంచజన్య చాలా విషయాలు అడిగాడు.

ఆమె కుటుంబ నేపథ్యం గూర్చి, సంగీత సాధన చేయడంలో ఎదురైన ఒడుదుడుకులు గూర్చి ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. తనతో తెచ్చుకున్న చిన్న పుస్తకంలో వాటిని వరుస క్రమంలో నమోదు చేసుకున్నాడు.

"ఖాళీ సమయాల్లో ఏం చేస్తుంటారు?"

"సంగీతం నాకు ఇష్టం. అది సాధన చేస్తుంటాను. చదరంగం అంటే ఇష్టం. గంటల తరబడి ఒంటరిగా ఆడుతూనే ఉంటాను. ఇంకా ఖాళీ దొరికితే కంప్యూటర్ ఆపరేట్ చేస్తుంటాను. ఇంట్లో వారికి నచ్చిన వంటలు చేస్తాను. కుట్లు అల్లికలు వంటివి చేస్తాను" అంది.

"మీరు అన్ని రంగాల్లోనూ కృషి చేస్తున్నారన్నమాట!"

"కళ్ళు లేవని బాధ తప్ప జీవితంలో అన్నీ సాధించాను. ప్రపంచాన్ని చూడలేరని అంధుల పట్ల సానుభూతి చూపడం కాదు. సమాన అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారు.." అంది.

తర్వాత మరికొన్ని విషయాలు మాట్లాడి – "మీ జీవితం ఎందరికో ఆదర్శనీయం... వస్తాను!" అని లేచి నిలబడ్డాడు.

"మీరు కీర్తి కాదు... అంధత్వాన్ని జయించిన కీర్తి పతాక!" అంటూ బ్యాంకు నుంచి బైటికి వచ్చేశాడు.

సరోజిని

ఆకతాయి అంకుల్స్...!



ఆ రోజు స్కూల్ నుంచి త్వరగా ఇంటికి వచ్చాను. చాలా రోజులయింది గదాని స్నేహితురాలు రమ ఇంటికి వెళ్లాను. ఇంట్లోకి అడుగు పెట్టేటప్పటికి రమ తన కూతుర్ను రాజీని ఓదార్చుతోంది.

"ఈ రోజు ఏమయిందమ్మా. రోజూ ఇలా మూడ్ పాడుచేసుకొని రావడం ఏమీ బాగుండలేదు." అంటోంది రమ.

"నేను రేపటి నుంచి కాలేజ్‌కు వెళ్ళను. బస్టాపులో ఆకతాయి అంకుల్స్ బెడద ఎక్కువగా ఉంది. బస్ ఎక్కిన తరువాత కూడా ఈ బాధ తప్పడంలేదు. వాళ్ళను తప్పించుకోవడం కష్టంగా ఉన్నదమ్మా. ఇక భరించడం నావల్ల కాదు" అంటోంది.

అప్పుడు నేను కలుగజేసుకుంటూ ఈ సమస్యకు కాలేజ్ మానేయడం పరిష్కారం కాదు. వారిని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించాలి. ఈ సమస్య బహుశా నీ స్నేహితులకు కూడా ఎదురవుతూ ఉండి ఉంటుంది గదా! వారందరినీ కలుపుకొని కలిసికట్టుగా ఎదుర్కొంటే ఇలాంటి వాళ్ళు తోకముడుస్తారు. భయపడుతున్నకొద్దీ భయపెడతారు. కానీ ఎదురుతిరుగుతారనుకుంటే మీ జోలికి రారు అన్నాను.

ఆకతాయిలు అనేక రకాలు. తల్లిదండ్రుల మాట వినకుండా చెడు సావాసాలతో ఆకతాయిలుగా మారే కుర్రాళ్ళ గురించి మనకు తెలుసు. వీరు అమ్మాయిలను, ఆడవాళ్ళను కూడా తమ వెకిలి చేష్టలతో చికాకు పెడుతుంటారు. తెలిసీతెలియని వయస్సులో ఇలా దారితప్పి ప్రవర్తిస్తున్న వారిని చూసి మనం జాలిపడవచ్చు. అవకాశముంటే వారిని మార్చే ప్రయత్నం కూడా చేయవచ్చు.

ఈ టీనేజ్ కుర్రాళ్ళు ఇలా మారడానికి కొంతవరకు స్నేహాలు, ఇప్పుడు వస్తున్న చెత్త సినిమాలు, సీరియళ్ళు కొంత వరకు కారణం. కానీ తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే కొంత శ్రమకోర్చి ప్రయత్నిస్తే వీరి సంఖ్యను కొంత వరకు తగ్గించగలం. వాటిని అప్పుడప్పుడు కుర్ర చేష్టలుగా కూడా మనం భావించే అవకాశం ఉంటుంది. కానీ మరో రకం ప్రమాదకరమైన ఆకతాయిలు ఈ మధ్యకాలంలో బస్టాపుల్లో, బస్సుల్లో మనకు దర్శనమిస్తున్నారు. వీళ్ళే ఆకతాయి అంకుల్స్! వీరి పట్ల యువతులు ముఖ్యంగా టీనేజ్ అమ్మాయిలు కొంత జాగ్రత్తగా ఉండటం అవసరం.

ఈ రకం ఆకతాయిలు కచ్చితంగా కాలేజీలు వదిలే సమయంలో మనకు దర్శనమిస్తుంటారు. ఏమీ ఎరగనట్లు అమ్మాయిల మధ్యలో నుంచి అవసరం ఉన్నా లేకపోయినా వారిని తాకుతూ తిరుగుతుంటారు. వీరి విషయంలో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే వారు మరింత రెచ్చిపోయి వారి ఆగడాలు మితిమీరే ప్రమాదాలుంటాయి. ముఖ్యంగా మధ్య వయస్కులే ఇలాంటి వెకిలి చేష్టలు, వేషాలు వేస్తుంటారు. వీరికి సలక్షణంగా భార్యాబిడ్డలు ఉంటారు. వీరు చక్కగా డ్రెస్ చేసుకొని ఉంటారు. చూడగానే అంకుల్‌లాగా ఉన్నాను గదా! ఒకవేళ తగిలినా పొరపాటున తగిలాననుకుంటారు అని ఈ రకంవారు అనుకుంటారు. పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ తనను ఎవరూ చూడటం లేదు అని అనుకొన్నట్లు అన్న మాట. ఇలాంటి చేష్టలు చేయందే వారికి నిద్ర పట్టదు. అందువల్ల ఇలాంటి వారి విషయంలో చాలా అప్రమత్తంగా ఉండటం అవసరం.

బస్సుల్లో కూడా ఇలాంటి వారు తరచూ కన్పిస్తుంటారు. వీరు అమ్మాయిల మీద ఒరిగిపోయి నిలబడటం, తాకుతూ ఉండటం వంటివి చేస్తుంటారు. అప్పుడు వారిని వెంటనే అడ్డుకుంటే ఇక మీ జోలికి రారు. అంతమందిలో తమ పరువు ఏమైపోతుందోనని భయపడతారు. కాబట్టి ఈ సమస్యను ఎదుర్కోవడానికి ముందుగా దీనివల్ల బాధపడుతున్నవారు చొరవ చూపాలి అంటూ పెద్ద లెక్చరే ఇచ్చాను.

అప్పుడు రాజీ ఒక కృతనిశ్చయానికి వచ్చినట్లు దృఢంగా ఇలా అంది. "మీరు చెప్పింది నిజం ఆంటీ. ఈ వైపు నుంచి నేనెప్పుడూ ఆలోచించనందుకు సిగ్గుపడుతున్నాను. ఇకముందు ఇలాంటి ఆకతాయిలను నా స్నేహితులతో కలిసి ధైర్యంగా అడ్డుకుంటా" అంది. దానితో అందరం తేలికగా ఊపిరి పీల్చుకున్నాం. ✿

‘అగగో.. యుద్ధ మత్తంది”

కాలువ మల్లయ్య



“యుద్ధమంటే...? యుద్ధమయితె ఎవ్వలో డింద్రు..? ఎవ్వలు గెలిచిం ద్రన్నది కాదు.. ఎంత సర్వనాశిన మయిందన్నది.. ప్రజల జీవితమెట్ల తునాతునకలయిందన్నది – ఏ యుద్ధమయినాగని గెలుపోటముల మాటెట్లున్నా బలయ్యేది ప్రజలే కదా–! మరి రాజ్జాలేలెదెవ్వలు...? పాలకులు...? గందుకే మరి శ్రీశ్రీ అన్నడు ఏ యుద్ధం ఎందుకు జరిగెనో... తారీఖులు దస్తావేజులు.. ఇవి కావోయ్ చరిత్రకర్థం అని.. పాతకాలం నుంచి గూడ యుద్ధాలు ఎవ్వల మంచుతన్నయి...? ఎవ్వల తేల్చుతన్నయి..? సరె గా పాతకాలపు యుద్ధాల సంగతిడ్సిపెడుదాం... మరి గిప్పుడెందుకు అగో యుద్ధం ఇగో యుద్ధం అని తెగ సంబరపడిపోతుంటరు.. నిజంగ గిదెంత నష్టదాయకమైందో తెలువదా...? గతం నుంచి గాని సమాజం నుంచి గాని వీళ్ళెందుకు గుణపాఠం తీసుకోరు...? అశోకుడు చేసింది ఒకేఒక్క కళింగ యుద్ధం.. గండ్ల తెగిపడిపోయిన తలుకాయలు.. ముక్కలు ముక్కలయిన మొండాలు.. చిందర వందరగ పడున్న శరీరావయవాలు.. చిట్లిన మెదల్లు..ఎంత సర్వనాశనం...? గదాన్ని జూచి వలవల ఏడ్చిండు అశోకుడు. ఇంకెప్పుడు యుద్ధం చేయనన్నడు...చేయలేదు.

యుద్ధం వీరోచిత మన్నరు కొందరు.. ఎవ్వలకు వీరోచితం..? ఎవ్వల కోసం యుద్ధం...? ధర్మయుద్ధాలు చేయవల్సిందే..కాని చీటికి మాటికి యుద్ధాలెందుకు...? ఆధిపత్యం కోసం యుద్ధాలెందుకు...? గతమంతా తడిసె రక్తంతోటి కాకుంటే కన్నీళ్ళతోని అన్న శ్రీశ్రీ మాటల్ల సత్యాలు లెవ్వా? గతమంత యుద్ధాలే అనంగాని ఎన్నెన్ని యుద్ధాలు? రాజ్యం కొరకు యుద్ధాలన్నీ మత యుద్ధాలు కుల యుద్ధాలు.. ఆధిపత్యం కోసం యుద్ధాలు.. గివ్వన్ని జరిగినయి గదా..! రగుతం ఏర్లయిపారింది గదా..! అయినా ఎందుకు కండ్లు తెరవరు పాలకులు...? యుద్ధమని ఎందుకురుకులాడ్తారు...? యుద్ధభయాన్నెందుకు రెచ్చగొడుతురు? రాజుల కాలం సంగతివేరు... మనలను మనం ఏలుకుంటున్న కాలంల గూడ గివ్వన్నెందుకు...?”

అన్నడు వెంకటరమణయ్య

“చెరిత్ర భూగోళమంత సదువుకచ్చినవోయ్ నువ్వు... గా పాతకాలపు యుద్ధాల సంగతివేరు – రథ గజ తురగ పదాతి దళాలతోని ఎంతమంది సచ్చేది? ఎన్నిరోజులు లడాయి చేసినా చచ్చేది తక్కువనే – ఆస్తులకయితె పెద్దగ నష్టమయ్యేది గాదు.. మరి గిప్పుడు యుద్ధమస్తె ఏమైతది..? లేవలేనోడు గూడ కుర్చీల కూసుంట మీట నొక్కుతడు.. నూర్లకొద్ది వెయ్యిల కొద్ది దూరంలున్న పట్టణాలు.. ఆస్తులు.. మనుషుల దుంపనాశనమై పోతరు.. గక్కడ గడ్డి కూడ మొలవది – హిరోషిమా, నాగసాకీలను చూసింద్రు గదా..! ఇప్పుడంతకంటెక్కో బలమైన ఆయుధాలు తయారయినయి.. మరి గవ్వీట్ని నాశినం జేసుడు మంచిదే కదా..! గా ఆయుధాలేం జేత్తయి... ప్రపంచం సావుకు మూహర్తం పెడ్తున్నట్టే కాద గవ్వంటే.. రోజు రోజుకు మనిషి ఆలోచనలెటు బోతున్నయి..? ఉన్న భూమెంత..? అంటే..? జీవరాశులుండటానికి అవకాశమున్న భూమెంత? ముత్తేమంతే కద..? మరి గాయింత భూమికి మనుషులు, ప్రాణులు ఉండకుండ జేసి ఏంజేత్తరట..? యుద్ధాలు చేసి మనుషులను నాశినేం జేసి ఎవ్వలనేలుకుంటరు...? శవాల నేలుకుంటరా..?” అన్నాడు వీరమల్లయ్య

“అవు.. గిప్పుడు యుద్ధమంటె ప్రపంచమంత భయమే.. కొందరు పాలకులకు సంబరమేమొ కని ప్రజలకైతే ఉచ్చబడ్తంది. అవు.. ఆయుధాలన్నిట్ని నాశినం చెయ్యాలె నిజమే కాని గండ్ల చిత్తశుద్ధుండాలె గదా..! నేనేమొ దేశం నిండ ఆయుధాల నుంచుకుంట.. ఇంకా తయారు జేత్తనే ఉంట.. నువ్వేమొ మొత్తం పారెయ్యాలనంటె గదెట్లుంటది..? గిట్ల పెద్ద బుష్షా చెప్పవట్టే..చిన్న బుష్షా చెప్పవట్టే ఎవ్వలింటరు..? పెపంచంలోనెగాదు గా అమెరికాదేశ ప్రజలుకూడా యుద్ధమద్దని ఊరేగింపులు తీయవట్టింద్రు. ఇయ్యాలేపు గా అమెరికదేశంల జరిగేటి ఎన్నికల్ల సుతా యుద్ధమన్నోణ్ణి ఓడిత్తమనంటుంద్రు. గసలు అన్ని దేశాలోల్లు గసోంటి ప్రమాదకరమైన ఆయుధాలను ఇసిరి పారెయ్యాలె. కాని జరుగుతున్నదేంది? దుడ్డున్నోలది బర్రన్నట్టే ఐతంది గద... మనిషిపుర్రెల పుట్టిన గీ దురాలోచన మొత్తం ప్రాణులన్నిటిని భూగోళం మీద ఉండకుండ జేత్తామన్నట్టు..? గిది వినాశనం గాదా..?

గీ భూమ్మీదనే గౌతమబుద్దుడు పుట్టిండు. సర్వజనహితము కోసరం ఎన్నో సంగతుల చెప్పిండు.. దుఃఖానికి కారణం దురాశన్నడు. గది పోవుటానికి అష్టాంగ మార్గాలను బోధించిండు. అధికారమనే దురాశే కద మనిషినిట్లా జేత్తంది? గప్పట్నించే బుద్ధుని బోధలు అరిగించుకొనుంటే మంచిగుండేది. ఏసు మాత్రం యుద్ధం కోరిండా..? గసోంటి మనిషినే శిలువేసిరి... గీ యుద్ధంతోని వచ్చేదేంటిదట..?” అన్నడు రామశాస్త్రి.

“యుద్ధమయితె ప్రజలకు నష్టంగని పాలకులకేం నష్టం..? బలమున్నోనికి ఆయిలత్తది.. ప్రజల బతుకులయితే గోరమయిపోతయి.. కొందరు యుద్ధంతోని కూడ లాభపడ్తరు. సావంగ చెక్కలుగులి చేస్తారంటరు గద.. గట్ల జేత్తరీల్లు.. కాట్లో కాలుతాంటె బీడంటు పెట్టుకునే రకమోల్లు వీళ్ళు. ‘బీదల పాట్లు’ అని ఓ నవలుండె.. గండ్లొ దరిద్రపుగొట్టు పాత్రుంది. గయినె పైసకోసురం ఏ పనయిన సేత్తడు – ఎంత నీచపు పని గానియ్యింండ్రి సేత్తడు.. సరిగ్గ యాదికి లేదుగని గండ్ల యుద్ధమో ప్రమోదమో జరుగుద్ది.. వేలాదిమంది శవాల కుప్పలుగ పడుంటరు.. శవాలు కుళ్ళిపోతున్న వాసనత్తంది.. గీ మనిషి గా శవాలల్ల తిరుగుతా ఉంటడు.. శవాలను తీసుటానికనుకునేరు.. శవాల మీదున్న నగలవీ గుంజుకుంటానికి.. మెడకున్న గొలుసును గుంజుతె తోలూసొస్తది. చెవులకున్న గంటీలు తియ్యబోతె చెవులత్తయి.. ముక్కుకున్న ముక్కెరను గుంజతె ముక్కే ఊసత్తది.. కాళ్ళకున్న కడేల కోసం రంపంతోని కాళ్ళనే కోత్తడు.. చేతులను కూడ గట్లనే సేత్తడు.. గిట్ల ఎంత దరిద్రపు పనులయిన సేత్తడు.. శవాలనటూ ఇటూ బొర్లిత్తడు.. జేబులల్ల ఏమన్నున్నయోమోనని వెతుకుతడు.. గది యాదికత్తె పెయ్యంత జలదరిత్తది.. మరి గిసోంటి మనుషులు గూటుంటరు.. శవం మీద పడే ప్యాలాలేరుకునే బాపతు వీళ్ళు.. గా ఇరాకుల ఏం జరిగింది? రసాయినికాయుధాలున్నయినిరి. గవ్వాటికోసరమని ఇరాకుమీదకెల్లిరి. పీనుగులపెంట చేసిరి. ఆ ఇరాకులోనే అబుగ్రాయిబనే ఓ జైలెట్టేసి ఆల్ల భూమిలో ఆల్లనే ఖైదీల్ని జేసి ఆ ఖైదీల్ని బరిత్తల్జేసి ఆల్లతో ఆటలడుకున్నరు. ఆ ఆటవికఆటల్ని ఫొటోలు తీసుకున్నరు. గదాన్కి థూ నీ బతుకుచెడ అని ప్రపంచమంతా అమెరికా బుష్ నోరుతెరిసి నోట్లో కాండ్రించి ఉమ్మేసే.”

వెంకటరమణయ్య మాటల్తోని అందరికి పెయ్యి జలదరిచింది... “యుద్ధాలత్తె ఇంకా సానమందికి లాభమే ఉంటది – ఎందుకంటె బేపారస్తులు ఏక్‌ధమ్ ధరలు పెంచిపారేత్తరు...”

“అవు... అగ్గసోంటి నిజాలు చెప్పినవోయ్ వెంకట్రమనయ్య..! అవుమరి.. గిదీంట్ల ఎంత అమానవీయతుంది దుర్మార్గమంది.. గిదంత రక్తపు కూడు సంపాదనన్నట్టేకద.. ఛీ...ఛీ.. గిది యాది కత్తినే రోతనిపిత్తంది...కరువులు, యుద్ధాలత్తె మీరు త్యాగాలు చెయ్యాలె.. పెరిగిన ధరలు భరించాలెనని మామూలు ప్రజలకు చెప్పుతారు మారాజులు. గందుకే బల్సిన దేశాలు యుద్ధం కోరుకుంటాయి.. ఆధిపత్యం కోరుకునెటోల్లు యుద్ధం కోరుకుంటరు. ఉన్మాదులు యుద్ధం కోరుకుంటరు. బల్సినోల్లు గూడ గదే కోరుకుంటరు. గిప్పుడు ప్రపంచం ప్రమాదం అంచునుంది. ప్రపంచం నేడు మరణాయుధాలు, బాంబులు, జీవ రసాయనాయుధాలుండగ యుద్ధం వస్తె ఇగ గదెట్లుంటుది..? గందుకే యుద్ధవద్దు. ఎప్పుడు యుద్ధం జరిగినా పాలకుల కెవ్వలకన్న నష్టమైందా? గెలిచినా... ఓడినా... నష్టపోయేది దేశం.. ప్రజలు. గందుకే మొత్తం నిరాయుధీకరణ జరుగుతేనే శాంతుంటది. గిప్పుడయితే ప్రపంచమంతట యుద్ధం వద్దని మొత్తుకుంటున్నరు. బజార్లకెక్కుతంద్ర. అమెరికా ప్రజలు గూడ యుద్ధం వద్దే వద్దని ఒర్రిసత్తంద్రు..” అన్నడు రాజమల్లు. ✤

నవంబర్ 2, ధన్వంతరి జయంతి

పురోగమనంలో చింతలూరు ఫార్మసీ

ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తికి అద్దం పట్టేలా 75 ఏళ్లకుపైగా తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలం చింతలూరులోని వెంకటేశ్వరా ఆయుర్వేద ఫార్మసీని నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయస్థాయిలో ఈ సంస్థ రోగులకు సేవలందిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాలలోనే 200కు పైగా బ్రాంచీలు, ఏజెన్సీలు, స్టాకిస్టులు, డీలర్లు ఉన్న ఈ సంస్థ లక్షలాది మంది రోగులకు సేవలందిస్తోంది.

దీర్ఘకాలికరోగులకు ఆయుర్వేదం అంటే ఈ చింతలూరులోని వెంకటేశ్వరా ఆయుర్వేద ఫార్మసీ గుర్తుకు వస్తుంది. ప్రాచీన ఆయుర్వేదాన్ని అభ్యసించిన ద్విభాష్యం కుటుంబం దాని విలువలను కాపాడుతూ రోగుల బాధా నివారణలో కీలకపాత్ర పోషిస్తోంది. ఆయుర్వేదంపై రోగులకు ఉన్న నమ్మకాన్ని పెంచే దిశగా ఈ సంస్థను నడుపుతున్నారు. కొత్తగా వచ్చే సవాళ్లను సైతం స్వీకరించి వెంకటేశ్వరా ఆయుర్వేద ఫార్మసీ వైద్య ప్రస్థానంలో తనదైన స్థానం నిలుపుకుంది. 2001 నుంచి జిఎంపి (గుడ్ మాన్యుఫేక్చరింగ్ ప్రాక్టీసెస్) సర్టిఫికెట్ పొందిన నాలుగు సంస్థల్లో ఇది ఒకటి. అంతర్జాతీయ మార్కెట్లో ఆయుర్వేదపరంగా తమ సంస్థకి మంచి గుర్తింపు లభించిందని ప్రస్తుత నిర్వాహకులు ద్విభాష్యం శ్రీరామమూర్తి తెలిపారు. ప్రపంచాన్ని పీడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని అదుపు చేసేందుకు బెనారస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయంతో తమ సంస్థ పరిశోధనలు చేస్తోందని చెప్పారు. ఈ పరిశోధనలు ఓ కొలిక్కి వచ్చాయని, త్వరలో మంచి ఫలితాలు వెలువడతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ పరిశోధనకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు.


మందుల తయారీకి వినియోగిస్తున్న యంత్రాలు

చింతలూరు సంస్థగా గుర్తింపు

వెంకటేశ్వర ఆయుర్వేద నిలయాన్ని చింతలూరు ఆయుర్వేద నిలయంగా పిలుస్తుంటారు. ఈ సంస్థ చింతలూరులో ప్రారంభం కావటంతో ఆ ఊరిపేరు మీద దీనికి మంచి గుర్తింపు లభించింది.

చరిత్ర ఏమంటే....

1925లో వెంకటేశ్వర ఆయుర్వేద నిలయం స్థాపించారు. దీన్ని "వైద్యరాజ" ద్విభాష్యం వెంకటేశ్వర్లు నెలకొల్పారు. ఆయుర్వేద ప్రయోజనాలు అందరికీ పంచటమే ద్విభాష్యం ఆశయం. ప్రపంచంలో ఉన్న ఔషధాల వివరాలను ఔపోసన పట్టిన ఆయన తరువాతి తరాలకు ఉపయోగపడేలా సేవలందించారు. ఈయన సేవాస్ఫూర్తి తరువాతి తరాలు కొనసాగించటం కూడా సంస్థ పురోగమనానికి కారణంగా పరిశీలకులు భావిస్తారు. "వైద్యరాజ" వెంకటేశ్వర్లు ఏకైక కుమారుడు వెంకట సూర్యనారాయణమూర్తి ఆయుర్వేద విద్యావేత్తలుగా, ఔషధ నిర్మాణ దక్షులుగా ప్రఖ్యాతులు. తండ్రిగారి అనంతరం వినూత్న విధానాలతో శాస్త్రీయ పద్ధతికి మరింత మెరుగుపెట్టి ఔషధాలు తయారు చేసి "అపరధన్వంతరి" గా కీర్తింపబడ్డారు. అసంఖ్యాక గౌరవసత్కారాలు ఆయన్ని వరించాయి. ఆయుర్వేద వైద్యంలో విశిష్టులుగా గుర్తించి 1991 లో మద్రాసు తెలుగు అకాడమీ "శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు" మెమోరియల్ అవార్డును సంస్థ నిర్వాహకులు అందుకున్నారు. 1992లో భారత కల్చరల్ ఇంటిగ్రేషన్ కమిటీ, న్యూఢిల్లీ ఆయుర్వేద సేవలకు గుర్తింపుగా నిర్వాహకులు

ద్విభాష్యం శ్రీరామమూర్తిని సత్కరించింది. 1993 ఉగాది సందర్భంగా హైదరాబాదు కిన్నెర ఆర్ట్స్ థియేటర్ నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, శ్రీరామమూర్తిని ఘనంగా సత్కరించారు. మన రాష్ట్రంలో 2001లో మొట్టమొదటి సారిగా జిఎంపీ సర్టిఫికెట్‌ను వెంకటేశ్వర ఆయుర్వేద కంపెనీ మొదటిగా పొందింది. 2002 ఏప్రియల్ 13వ తేదీన ప్రభుత్వ విశిష్ట పురస్కారం, మద్రాసు తెలుగు అకాడమి ఈ ఉగాదినాడే ఔషధ నాణ్యతకు గుర్తింపుగా ఢిల్లీ తెలుగు అకాడమీ రాష్ట్రీయ వికాస్ శిరోమణి అవార్డు పొంది ఈ సంస్థ నిర్వాహకులు ఖ్యాతిని ఆర్జించారు. ఇప్పటికి ఏడు బంగారు పతకాలను సంస్థ నిర్వాహకులకు బహూకరించారు. హైదరాబాదులోని ది ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్ చిన్న తరహా పరిశ్రమలో ఉత్తమ ప్రమాణాలు పాటించి ఆరోహరచంద్ర ప్రభాదివటి, చ్యవనప్రాశలేహ్యం ఔషధాలపై శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి సంస్థగా గుర్తించి వేంకటేశ్వర ఆయుర్వేద నిలయము (ప్రై) లిమిటెడ్, చింతలూరు వారికి సిల్వర్ ట్రోఫీ బహుకరించింది. ఈ నిలయం సేవలు మరింతగా విస్తరించేందుకు ఆయుర్వేద వైద్యుల, అఖిల జనుల ఆదరణ, ప్రోత్సాహం, సహకారం ఆయుర్వేద నిలయ నిర్వాహకులు కోరుతున్నారు.

దేశంలో ఏకైక ధన్వంతరి ఆలయం

దేశంలో ఏకైక ధన్వంతరి ఆలయం చింతలూరులోనే ఉంది. ధన్వంతరికి పూజలు నిర్వహించటమే కాకుండా, జాతీయస్థాయిలో ఆ సందర్భంగా పోటీలను నిర్వహించే సంప్రదాయం వెంకటేశ్వర ఆయుర్వేద నిలయం నెలకొల్పింది.


వనమూలికలను నూరుతున్న కార్మికులు

ధన్వంతరి జయంతి సందర్భంగా ఇక్కడ అన్న దానం వంటి కార్యక్రమాలను చేపడుతుంటారు.

'ఆయుర్వేద ప్రపంచం....'

వనమూలికల వాసనల గుభాళింపు.... చల్లని గాలి.... ప్రశాంతమైన వాతావరణం..... ఇది చింతలూరు వెంకటేశ్వర ఆయుర్వేద నిలయంలోని వాతావరణం. కాలుమోపగానే చల్లని గాలి పలకరిస్తుంది. తలుపుకు ఫ్యాన్‌ను అమర్చారు. కేవలం తలవరకే ఈ గాలి సోకుతుంది. దీంతో మంచి వేసవిలో ఇక్కడికి వచ్చే వారికి త్వరితగతిన ఉపశమనం లభిస్తుంది. రోగి మనస్సు కొంత కుదుటపడుతుంది. ఆయుర్వేదం చికిత్స రోగిని వనమూలికల మధ్య గడిపేలా చేయటంతో ప్రారంభమవుతుందన్న సూత్రాన్ని ఈ సంస్థ కచ్చితంగా పాటిస్తోంది. ఈ నిలయమంతా వనమూలికల వాసనలొస్తుంటాయి. ఇదో కొత్తప్రపంచంగా భావించి రోగులు సేదతీరుతారు. ఈ నిలయంలో అడుగు పెట్టగానే రోగి వ్యాధి నిర్ణయిస్తారు. దానికి అనుగుణంగా చికిత్స, సేవలు అందిస్తారు.

గోల్డ్ కంట్రోల్ యాక్టు సమయంలోనూ....

ప్రతికూల పరిస్థితుల్లో పని చేయటమే కీలకమన్న సామెత ఈ సంస్థ చేసే కృషికి దర్పణంగా చెప్పవచ్చు. 1969లో 'గోల్డ్ కంట్రోల్ యాక్టు' ప్రవేశ పెట్టినపుడు ఔషధాల తయారీకి బంగారం కొనుగోలునకు అనుమతి లేదు. ప్రతీ సంస్థ ఆ సమయంలో బంగారంతో తయారు చేసే మందుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. భారతప్రభుత్వం నుండి వెంకటేశ్వర ఆయుర్వేద నిలయానికి ఆరుకేజీల బంగారం కొనుగోలుకు ప్రత్యేక అనుమతి లభించింది. దీంతో ఆ ఏడాది కూడా ఆయుర్వేద మందులను సమర్థవంతంగా మార్కెట్‌లోకి పంపిన రికార్డు ఆ సంస్థకు దక్కింది.

నండూరి రవికుమార్

గట్టి వెంకట్రావు

భారతీయ మహిళల్లో ఎయిడ్స్ అవగాహన తక్కువ

గత కొన్ని దశాబ్దాలుగా అక్షరాస్యతా ప్రమాణాలు కొంత మెరుగైనప్పటికీ మనదేశంలో అనేక అంశాల పట్ల అవగాహన చాలా తక్కువగానే ఉంటోంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్‌ఎస్) ఇటీవల విడుదల చేసిన సర్వేను బట్టి దాదాపు 60 శాతం మంది భారతీయ మహిళలు ఎయిడ్స్‌ను గురించి ఎన్నడూ వినికూడా లేరు. ప్రజల్లో ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచాలన్న ప్రభుత్వం విధానం నేపథ్యంలో ఈ నివేదిక వెలువడింది. మనదేశంలోని మెజారిటీ మహిళలకు ఎయిడ్స్‌ను గురించిన ఎలాంటి అవగాహన లేదని వెల్లడయింది. ఈ వ్యాధి రాకుండా నిరోధించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి కూడా వారికి పెద్దగా అవగాహన లేదు. గ్రామీణ ప్రాంత మహిళల్లోనూ, నిరక్షరాస్యులైన మహిళల్లోనూ ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. మహిళల్లో అక్షరాస్యతా స్థాయిని పెంచడం ద్వారా మాత్రమే ఈ అవగాహనను పెంచగలుగుతామని ఆ నివేదిక పేర్కొంది. అక్షరాస్యులైన మహిళల్లో 92 శాతం మందికి ఈ వ్యాధి గురించిన అవగాహన ఉండగా నిరక్షరాస్యుల్లో 18 శాతం మందికి మాత్రమే ఉంది. ఈ విషయంలో బీహార్ రాష్ట్ర మహిళలు చాలా తక్కువ స్థాయిలో 12 శాతంగా ఉన్నారు. 23 శాతం కంటే తక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఉన్నాయి. ఎయిడ్స్ కేసులు అధికంగా ఉన్న రాష్ట్రాలలో ఈ అవగాహన స్థాయి కూడా కొంత మెరుగ్గా ఉన్నట్లు నివేదిక తెలిపింది. మణిపూర్ ఈ అవగాహన విషయంలో ప్రథమ స్థానంలో ఉండగా, ఈశాన్య రాష్ట్రాలు తరువాతి స్థానంలో ఉన్నాయి. 1990 నాటి సర్వేతో పోల్చినప్పుడు ఢిల్లీలో ఈ స్థాయి 36 నుంచి 79కి పెరిగింది.

ఈ వ్యాధి రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలకు సంబంధించి అవగాహనను పెంచాల్సిన అవసరం ఉన్నదని సర్వే అభిప్రాయపడింది. దీనికి సంబంధించి ఇంటర్వ్యూ చేసిన మహిళల్లో ఎక్కువ మంది జీవిత భాగస్వామి వల్ల ఇది సోకుతుందనే విషయాన్ని తెలిసి ఉన్నారు. సరిగా శుభ్రం చేయని సూదులు, ఇతర వైద్య పరికరాల వల్ల ఈ వ్యాధి సోకుతుందనే విషయం కూడా వారిలో కొందరికి తెలుసు. ఈ పరిస్థితిని తొలగించాలంటే చదువు కీలకమైందిగా తేల్చారు.

పుస్తక పరిచయం

హరీంద్రనాథ్ నాటికల విశ్లేషణ

హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ బహు ముఖ ప్రజ్ఞాశాలి. కవి, సంగీత కారుడు, నటుడు, నాటకకర్త. కవిగా అతనికున్న ప్రశస్తి, నాటకకర్తగా అతని ఖ్యాతిని మింగేసిందేమోనని పరిశోధకురాలు కె.సునందగారు అభిప్రాయపడుతున్నారు. ముప్పయ్యవ దశకం నాటి సామాజిక, రాజకీయ ఆర్థిక పరిస్థితుల పట్ల స్పందించిన హరీంద్రుడు మార్క్సిస్టు భావాలతో ప్రభావితమైన మేధావివర్గ ప్రతినిధిగా సందేశాత్మక నాటక రచనారంగంలోకి దూసుకువచ్చారు. రాసిన అయిదు నాటికలకు పెట్టిన పేర్లు, వాటి అంకితాలను బట్టి వాటిలోని ఇతివృత్తాన్ని ఊహించవచ్చు. ''కిటికీ' అనే నాటికను బొంబాయిలోని వర్లీ కార్మికులకు అంకితమిచ్చారు. నికృష్ట జీవితాలనుభవించే కార్మికుల తిరుగుబాటు ఇంటిలోని వృత్తాంతం. "కిటికీ" నాటికలో రెండు వర్గాల మధ్య వున్న వ్యత్యాసాన్ని, వైషమ్యాన్ని చక్కగా చిత్రీకరించడం జరిగింది. కాని నాటకానికి ఆయువుపట్టయిన సంఘర్షణ లోపించడం వల్ల నాటిక పేలవంగా తయారైందని పరిశోధకురాలి విమర్శ. భార్యాభర్తలు ఎలా ప్రేమరాహిత్యంలో నిస్సారంగా తమ బ్రతుకులు గడుపుతున్నారు ఎవరి చట్రంలో వారు ఎలా బందీలుగా వున్నారు 'చిలుక' నాటిక తెలియజేస్తుంది. నిద్రాణమై వున్న స్త్రీని మేలుకొలిపే ప్రయత్నమిది. కట్టుబాట్లను తెంచుకొని పంజరంలో నుండి స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగిడమని ఈ నాటిక ఉద్బోధిస్తుంది. "కాపలాదారుని లాంతరు" వ్యక్తి అలసత్వాన్ని పారద్రోలి పోరాడవలసిన ఆవశ్యకతను ప్రబోధిస్తుంది. బూర్జువా భావాలు తలకెక్కిన ఒక కళాకారుడి జీవితానికి వ్యంగ్య చిత్రీకరణే "శవపేటిక". కథకోసమూ, కాసుల కోసం కాకుండా ప్రజల కోసం పురోగతి కోసం, రచనలు చేయాల్సిన అగత్యముందని "కాపలాదారుని లాంతరు" "శవపేటిక" నాటికలో హరీంద్రుడు నొక్కి చెబుతారు. మాయలాంటి అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి చైతన్యపు వెలుగును ప్రసరింపజేసే ప్రయత్నమే 'సంధ్యాదీపం' నాటిక. ఇందులో 'కిటికీ' ప్రయోగాత్మక నాటిక కాగా, 'సంధ్యాదీపం' ఎక్స్‌ప్రెషనిజంకు ప్రతీక. దాదాపుగా ఇవన్నీ ఏకాంకికలే. ప్రదర్శన దృష్ట్యా పేలవంగా తయారైన ఈ ఆంగ్ల నాటికలు బహుశా చదువుకోవడానికి ఉద్దేశించినవి కావచ్చు. ప్రచారానికి ఉద్దేశించినవి కాబట్టి సిద్ధాంతీకరణ పాలు ఎక్కువ. అయినప్పటికీ, ఈ నాటికలన్నీ వాస్తవానికి దగ్గరగావుండి నాటకకర్త సాంఘిక స్పృహను, పరిశీలనా శక్తిని తెలియజేస్తాయి. ఆంగ్లభాషలో నాటక రచన చేసిన భారతీయులు అరవిందరావు, ఠాగూరు, టి.పి.కైలాసం లాంటి వాళ్ళున్నా సామాజిక ప్రయోజనమే ముఖ్యోద్దేశంగా ఒక నిబద్ధతతో రాసిన వాడు హరీంద్రుడొక్కడే. అదే అతని గొప్పదనం. హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ నాటికలపై ఆంగ్లంలో ఎం.ఫిల్ చేసిన పరిశోధన తాలుకూ సారాంశమే ఈ చిన్నిపుస్తకం. పరిశోధన నిష్పక్షపాతంగా, విమర్శనాత్మకంగా ఉండాలని మరోమారు ఈ పుస్తకం గుర్తుకుతెస్తుంది.

- కె.పి.అశోక్ కుమార్

హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ సాంఘిక నాటికలు -విశ్లేషణ

రచన : డా॥ కె.వసంత; **వెల :** రు. 16/-; **పేజీలు :** 41; **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

స్వీకారం



పార్టీల దామాషా ఎన్నికల విధానం-ఆవశ్యకత

రచన : చుక్కపల్లి పిచ్చయ్య; వెల:రు. 1/-; ప్రతులకు : పాపులర్ షూమార్టు గ్రూపు సంస్థలు, విజయవాడ



శ్వేతపత్రం

రచన : అడిగోపుల వెంకటరత్నం; వెల:రు. 40/-; ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్నిబ్రాంచీలు; జయంతి పబ్లికేషన్స్, హైదరాబాద్

శ్రీ కృష్ణదేవరాయలు

రచన : డాక్టర్ బండ్లమూడి సుబ్బారావు; వెల:రు. 50/- ప్రతులకు : డాక్టర్ బండ్లమూడి సుబ్బారావు, 401, కావ్యా డీలక్స్ అపార్ట్‌మెంట్స్, మధురానగర్, హైదరాబాద్ - 38

రాకెట్ల వీరన్న

మైసూరు బృందావనం



మైసూర్ అనగానే గుర్తుకు వచ్చే అద్భుతమైన అందాలలో "బృందావన్ గార్డెన్స్" చాలా ముఖ్యమైనది. ఈ బృందావన్ గార్డెన్స్‌ను మన చిన్నప్పటినుండి అనేక కేలండర్ల మీద చూసివున్నాం. అనేక సినిమాలలో పాటల్లో, కొన్ని దృశ్యాల్లో చిత్రించగా కూడా చూశాం. కేలండర్లలో చూసినా, సినిమాలలో చూసినా స్వయంగా మైసూరు వెళ్ళినప్పుడు ఆ అందమైన తోటను చూసిరావడం ఎన్నో రెట్లు అనుభూతిని మన మదిలో మిగుల్చుతుంది. దాదాపు అదే అనుభూతి శ్రీరంగపట్నం వెళ్ళినప్పుడు కూడా కలిగితీరుతుంది. భారతదేశ పర్యాటక ప్రాంతాలుగా అంతర్జాతీయంగా ప్రసిద్ధికెక్కిన పర్యాటక ప్రదేశాలివి.

బృందావన్‌గార్డెన్స్

మనసును దోచే మైసూరు అందాలలో ఒకటిగా ప్రత్యేకంగా బృందావన్‌గార్డెన్స్‌ని చెప్పవచ్చు. వందలాది రకాల పూలమొక్కలు, రకరకాల చెట్లు, ఆర్టిఫిషిల్‌గా ఏర్పాటు చేసిన విచిత్రమైన వాటర్ ఫౌంటేన్‌లు, నీటి కోళ్లు, బాతులు, చిలకలు తదితర పక్షి రాజాలు, ఎత్తైన లాంతర్లు, రకరకాల లైట్లు అమర్చిన రంగునీళ్ళ ప్రవాహం, ఇలాంటి మనోహరమైనవి ఎన్నో, ఎన్నెన్నో మనం చూడవచ్చు. మైసూరు నగరానికి దక్షిణ దిశలో 19 కిలోమీటర్ల దూరంలో క్రిష్ణరాజసాగర్ రిజర్వాయర్ దిగువ భాగంలో ఈ బృందావన్ గార్డెన్స్ ఉంది. దీనికి వెళ్తూ కావేరి నదిపై నిర్మించిన అందమైన క్రిష్ణరాజసాగర్ రిజర్వాయర్‌ను కూడా చూడవచ్చు. మామూలు రోజుల్లో సాయంత్రం ఏడు నుండి ఎనిమిది వరకు, సెలవు రోజుల్లో ఏడు నుండి తొమ్మిది గంటల వరకు బృందావన్ గార్డెన్స్ చూడవచ్చు.

శ్రీరంగపట్నం

మైసూరు పట్టణానికి 16 కిలోమీటర్ల దూరంలో శ్రీరంగపట్నం ఉంది. ఇక్కడికి మైసూరు నుండి చక్కటి రోడ్డు, రైలు సౌకర్యం ఉంది. ఇది చూడముచ్చటైన ప్రదేశం. ఐలాండ్ టౌన్‌గా దీనిని పిలుస్తారు. రెండు బ్రాంచ్‌లుగా కావేరీనది పట్టణం చుట్టూ ఉంటుంది. ఇక్కడ పర్యాటకుల్ని అత్యధికంగా ఆకర్షించేది రంగనాథస్వామి ఆలయం, కావేరీ నదీ సంగమం. ఇక్కడి రంగనాథస్వామి ఆలయాన్ని క్రీ.శ. 894లో నిర్మించారు. మొత్తం కర్నాటకలో ద్రవిడ నిర్మాణ శైలిలో ఉన్న దేవాలయం ఇదొక్కటే. ఉదయం ఎనిమిది నుండి మధ్యాహ్నం 12 దాకా, సాయంత్రం 4-30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు దేవాలయ దర్శనముంటుంది.



ఇక్కడ చెప్పుకోదగ్గ మరొక ప్రదేశం జుమ్మా మసీద్, టిప్పు సుల్తాన్ మ్యూజియం జుమ్మా మసీదులో నిర్మించిన డోమ్ చూపరులకు కనువిందు చేస్తుంది. అక్కడ ఉన్న స్తంభాలకు అతి ఖరీదైన గ్రానైట్‌ను వాడారు. టిప్పు సుల్తాన్ మ్యూజియంలో అప్పటి సైనికులు, టిప్పు సుల్తాన్ వాడిన డాలు, కత్తులు, బల్లాలు, ఫిరంగులు తదితర యుద్ధ సామాగ్రిని భద్రపరిచారు. సైనికులు ధరించిన వస్త్రాలు, బూట్లు, రక్షణ కవచాలు చూపరులను ఎంతో ఆకర్షిస్తాయి. దీనిని 'దర్గా దౌలత్ బాగ్' అని కూడా పిలుస్తారు. ఇక్కడ మరీ మరీ చెప్పుకోదగ్గ ప్రదేశం కావేరీనదీ సంగమం. కావేరీ నది రెండు పాయలు ఇక్కడ కలుసుకుంటాయి. ఆ ప్రదేశం ఎంతో నిర్మలంగా, ప్రశాంతంగా, చుట్టూ చెట్లతో, పక్షుల కిలకిలా రావాలతో కావేరీ గలగల శబ్దాలతో మనసును పులకింపజేస్తుంది. శ్రీరంగపట్నం కొచ్చిన పర్యాటకులు అంతా చూసిన తర్వాత ఇక్కడకొచ్చి భోజనాలు చేసి సేద తీరుతారు. శ్రీరంగపట్నానికి 5 కిలోమీటర్ల దూరంలో రంగనతిట్టు పక్షి సంరక్షణా కేంద్రం ఉంది.

ఈ మైసూరు విశేషాలు చదివితేనే అక్కడికి వెళ్ళాలని ఉబలాటపడతాం. అలాంటిది మనం వీలుచేసుకుని విహారయాత్రగా వెళ్తే మనమెంతో పులకించిపోతాం. ✤

హెచ్.రమేష్‌బాబు

అక్టోబర్ 28న కొసరాజు వర్ధంతి

సినీ జానపద కవిరాజు కొసరాజు

తెలుగు చలనచిత్ర రంగంలో జానపద, గ్రామీణ గీతాలకు పెద్దపీట వేసి సుమారు అరశతాబ్దం పాటు జానపద కవిబ్రహ్మగా పేరుగాంచిన సినీకవి కొసరాజు రాఘవయ్య చౌదరి.

కొసరాజు గుంటూరు జిల్లా అప్పికట్లలో 1905లో జన్మించారు. బాల్యంలోనే చక్కని కవిత్వం చెప్పడం సహజంగా అబ్బిందాయనకు. చదివింది అప్పటి నాలుగో తరగతే. తన 15వ ఏటనే అష్టావధాన, శతావధాన, నేత్రావధానాలు చేసి 1920లో మద్రాసు ముఖ్యమంత్రి 'పానగల్ రాజా'చే 'బాలకవి' బిరుదుతో గౌరవాన్నందుకున్నారు. జమీన్‌రైతు ఉద్యమంలో చిత్తూరు జిల్లాలో గ్రామ సంచారం చేసి తన కవితా ప్రాభవంతో గ్రామ ప్రజలను జాగృతం చేశారు. కవిత్వంలోనే మునిగితేలుతున్న కొసరాజు, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరికి ప్రియశిష్యుడు. ఒకానొక సందర్భంలో కట్టమంచివారు రెడ్డికుల చరిత్రను రాస్తున్నారని తెలుసుకున్న కవిరాజు తాము కూడా కమ్మకుల చరిత్రను రాయించాలని అందుకు అధ్యయనం చేయడానికి 1931లో కొసరాజును మద్రాసుకు పంపడంతో ఆయన సినీ జీవితానికి బీజం పడింది.

గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో వచ్చిన రైతుబిడ్డ (1939) సినిమాలో కొసరాజు తొలిసారిగా 'రామిరెడ్డి' పాత్ర వేశారు. నటించడమేగాక పాటలు కూడా రాశారు. ఈ చిత్రంలో రాసిన "నిద్దుర మేల్కొనరా తమ్ముడా గాఢ నిద్ర మేల్కొనరా", "రైతుపైన అభిమానము చూపని రాజులుండనేల?" "సైసై చిన్నపురెడ్డి" పాటలు ఆదరణ పొందాయి. 'అపవాదు' చిత్రానికి పాటలు రాసిన అనంతరం కొంతకాలం స్వస్థలం వెళ్ళిపోయి వ్యవసాయంతో బాటు సాహితీ వ్యవసాయం చేస్తూ పత్రికా రంగంలో పని చేశారు. డి.వి.నరసరాజు పిలవగా 1954లో వచ్చిన "పెద్దమనుషులు"తో సినిమాల్లోకి పునఃప్రవేశం చేశారాయన. 'పెద్దమనుషులు'లో "నందామయ గురుడ నందామయ", "శివశివమూర్తివి గణనాథ" పాటల్లోని "గొర్రెల్ని తినువాడు గోవింద కొడతాడు, బర్రెల్ని తినువాడు వస్తాడయ్యా, పగలె చుక్కలు మింట మెలిపింతునంటాడు నగుబాట్లువడి తోక ముడిచేనయా' అంటూ విసిరిన వ్యంగ్య రాజకీయ విసుర్లు నాడే ఆయన దూరదృష్టిని నిరూపించాయి.

గ్రామీణ రైతు కుటుంబంలో పుట్టడం వల్లనే కొసరాజు జానపద గీతాలనే ఎక్కువ రాసి సినీ జానపద కవిరాజుగా పేరొందారు. రాసిన ప్రతి పాటా జనాదరణ పొందినదే. పండిత పామరులతో బాటు యువతరం శ్రోతలను సైతం అలరించాయి. తెలుగు సినిమాల్లో హాస్యం పలికించే, వ్యంగ్యం తొణికే పాటలు రాయాలంటే ఒక్క కొసరాజుకే సాధ్యమైంది. ఆయన చేతనే రాయించుకోవాలని దర్శక నిర్మాతలు ఇష్టపడేవారు. సినిమాలో పాటలన్నీ రికార్డు అయిపోయిన తరువాత మరింకేదో కొసరు మిగిలిపోయినట్లు హాస్య తారల మధ్య సన్నివేశం కల్పించి కొసరాజు చేత పాట రాయించుకున్న సందర్భాలు కోకొల్లలు.

1955లో వచ్చిన 'రోజులు మారాయి'లో వహీదా రెహమాన్‌పై చిత్రించిన 'ఏరువాకా సాగారో' పాట కొసరాజును జనసామాన్యానికి చేరువ చేసింది. 'కులగోత్రాలు'లోని 'అయ్యయ్యో చేతుల డబ్బులు పోయెనే', 'ఇల్లరికం'లోని 'నిలువవే వాలు కనులదానా' పాటలు నేటితరం వారి పెదవులపై కదలాడుతున్నాయి. 1954లోనే వచ్చిన 'రాజు–పేద'లోని 'జేబుల బొమ్మ జేజేల బొమ్మ' 'కళ్ళు తెరచి కనరా సత్యం' పాటలు కొసరాజు కలం బలాన్ని చాటాయి.

కొసరాజు తన పాటల్లో వాడే పదాలు, అవి ప్రాచుర్యం పొందిన వైనమూ చూస్తే ఆశ్చర్యానందాలు కలుగుతాయి. ఆయన రాసిన పాటల్లో ప్రాసకోసం పాకులాడినట్లుగా పట్టిపట్టి చూసినా ఎక్కడా కనిపించదు. అసలు ఆయన వాడే పదాలన్నీ మనం నిత్యం వాడుకునే పదాలే. "ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత', 'టౌను పక్కకెళ్ళొద్దురో', 'సరదా సరదా సిగరెట్టు' పాటల్లోని పదాలన్నీ మనకు పరిచితమైనవే.

కొసరాజు గీతాల్లో భాష సామాన్యులను అలరించడమే కాదు భావం కూడా ఆలోచింపజేస్తుంది. 'జయం మనదే'లోని 'వస్తుందోయ్ వస్తుంది, కారే చెమట యేరులై ప్రపంచాన్ని కబళించే రోజు వస్తుంది' అనే పాటలో 'ఈ చెమటే రేపింతై అంతై తుపాను రూపై ధూముధాములతో' అంటారు. 'నమ్మిన బంటు'లోని 'పొగరుబోతు పోట్లగిత్తరా' పాట కూడా జనరంజకమైనది. 'మంచి మనసులు'లోని 'మామ మామా' పాట కొసరాజు రచనా వైభవాన్ని అత్యున్నత శిఖరంపైకి చేర్చిందని చెప్పవచ్చు. నలభై ఏళ్ళు దాటిన ఈ పాట ఇప్పటికీ పాపులరే. 'మూగమనసులు'లోని 'గౌరమ్మా నీ మొగుడెవరమ్మా' పాట గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

కొసరాజు గురించి చాలామందికి తెలియని విషయం ఒకటుంది. ఆయన ప్రసిద్ధ మరాఠీ, హిందీ దర్శక నిర్మాత వి.శాంతారాంతో పని చేసిన సంగతి. శాంతారాం 'నవ్‌రంగ్' సినిమాను హిందీతో బాటు తెలుగులో కూడా తీయాలని అనుకొని మంచి గేయ రచయితను ఎంపిక చేసి పంపమని నాగిరెడ్డి–చక్రపాణిలకు లేఖ రాశారు. వారు కొసరాజును బొంబాయి పంపారు. తెలుగులో ఏయే పాటలు రాశారని శాంతారాం అడిగినప్పుడు ఇండస్ట్రీకి వహీదారెహమాన్ పరిచయమైన 'ఏరువాకసాగారో' పాటను తానే రాశానని చెప్పారు. 'జేబులో బొమ్మ', కళ్ళు తెరిచి కనరా' పాటల రికార్డులు వినిపించారీయన. ఈయన ప్రతిభను గుర్తించిన శాంతారాం భరత్ వ్యాస్ రాసిన పాటలను తెలుగు వెర్షన్ కోసం రాయించారు. వీటిలో కొన్ని సి.రామచంద్ర సంగీతంలో జమునారాణిచే పాడించారు. అయితే తర్వాత ఏవోకారణాల వల్ల ఈ సినిమా రూపొందలేదు. కానీ భరత్ వ్యాస్, శాంతారాం, సి.రామచంద్రలు కొసరాజు కవితా ప్రతిభను అభినందించారు. ఈ అనుభవం తమ జీవితంలో మరచిపోలేని జ్ఞాపకం అని విజయచిత్రలో ఒక సందర్భంగా రాశారు.

ఈ నేపథ్యంలో కొసరాజు 'ముద్దబంతి పూలు పెట్టి' (కలసి ఉంటే కలదు సుఖం), 'సరదా సరదా సిగరెట్టు' (రాముడు భీముడు), 'వినరా వినరా నరుడా' (గోవుల గోపన్న), 'మత్తువదలరా నిద్దుర మత్తువదలరా (శ్రీకృష్ణపాండవీయం), 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' (లవకుశ), మా రాజు వినవయ్య' (రోజులు మారాయి), 'శివగోవింద గోవింద' (వెలుగు నీడలు), 'జయమ్ము నిశ్చయమ్మురా' (శభాష్ రాముడు) వంటి పాటలెన్నో కొసరాజు కలంలోంచి జాలువారాయి.

కొసరాజు అప్పటి మద్రాసు ప్రధాని

భరత ఖండం

వేదభూమి
కర్మభూమి
జీవభూమి
మహాచరితగల మహాఖండం
నేడు...
భరతఖండం భగ్గుమంటోంది
భారతీయత భగ్గుమంటోంది
విషాదాగ్నిలో దగ్ధమవుతూ
భవిత కానక వివశమై ॥భరత॥
ధర్మవీరుడు, ధర్మశోధకుడు, భౌద్ధమత ప్రచారక అశోకుడు
అహింసాత్ముడు, సిద్ధార్థుడు, మహాబుద్ధుడు అయినవాడు
మహానిష్ఠా, మహావీరుడు, మహాజైనుడు అయినవాడు
మహాత్ములున్న మహీఖండం మసైపోతుంటే
భారతమ్మ బంధనాలకు ముక్తిలేక, విముక్తి లేక
అశ్రుధారలు రక్తధారలుగా మారుతుంటే ॥భరత॥
మతవిభేద మూర్ఖత్వం మారణం జరిపెనా
భరతజాతి విశిష్టతను మంటగలిపే అసురకృత్యం
క్రూరతత్వ కాల్పులేమో కర్కశంగా కాల్చివేయగా
కరుకు గుండెల పగలు సెగలై అగ్నిగుండ మాయెనే
గాంధీలకు తప్పదా అకాల మృత్యుకాండలు
ఘోర ఈ జీవక్రియలకు అంతమంటూ ఎప్పుడో ॥భరత॥
గాంధీలున్న దేశంలో గాడ్సేల విజృంభణం,
ఇందిరమ్మను నిలువున మరి పేల్చివేసిన దారుణం
తాళలేక, తోడులేక, విడువలేక, మోడు అయ్యె భారతం,
విషాదాగ్ని మ్రింగుకుంటు, మంటలన్ని ఓర్చుకుంటు
ఘోర ఈ కలి కాకలార్పే గాంధిలేమో రాలాయె ॥భరత॥
తిరంగంటు రెచ్చిపోతూ వాదులాడే పరివారమూ,
తిరంగమందించిన పింగళిని తలవనట్టి స్వార్థ ప్రతిపక్షమూ
దేశీయత కాదంటూ, దేశకోడలి అవమానము
భువినాధులు కావాలంటూ, రాజకీయ దారుణాలు
భరతజాతి చరిత్రనే మార్చనెంచిన మౌఢ్యులు
భరతమాత రుధిరక్షీరం పీల్చు రక్తపింజరాలు ॥భరత॥
అర్థరాత్రి స్వతంత్రానికి అంధకార బంధురం
నాటి భక్తుల దేశభక్తుల నిష్టకిది నిర్మూలనం
మానవత మసిబారిపోయి మహాప్రళయం సంభవిస్తే
పంజాబ్‌లేదు, గుజరాతు లేదు, మరాఠలేదు
మంగళం మరి ఎప్పుడో మరో ప్రపంచం మరి ఎప్పుడో
మంగళం మరి ఎప్పుడో మరో ప్రపంచం మరి ఎప్పుడో

- పేటేటి రత్న

బి.మునుస్వామి నాయుడు ప్రోత్సాహంతో రైతాంగ బాధలను 'కడగండ్లు' గ్రంథంగా రాశారు. దీనికి తొలిపలుకు రాసేందుకు చాలామంది వెనుకడుగు వేశారు. కానీ కాశీనాథుని నాగేశ్వరరావు దానికి పరిచయ వాక్యాలు రాసి కొసరాజు సాహిత్య ప్రతిభను ప్రశంసించారు. నాటి రాజకీయ, సాంఘిక స్థితిగతులకు వ్యంగ్యంగా పలు గేయాలను రాశారాయన. ఇంకా ఆయన కొండవీటి వైభవం, 'గంటికోట యుద్ధం,' 'మిత్రనీతి', 'కొసరాజు విసుర్లు', 'ఆంధ్రగీతి', 'సినిమా డైరెక్టర్', 'నవభారతం' వంటి రచనలు చేశారు.

కొసరాజు సినీ సాహితీ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం 1984లో రఘుపతి వెంకయ్య అవార్డును, 1985లో ఆంధ్ర విశ్వ విద్యాలయం 'కళాప్రపూర్ణతో' గౌరవించింది. 'కవిరత్న', 'జానపద కవిసార్వభౌమ' తదితర బిరుదులు పొందారు. నెహ్రూచే సన్మానం, ఎన్.టి.ఆర్.చే కనకాభిషేకం, నీలం సంజీవరెడ్డిచే స్వర్ణపతకంతో సన్మానా లందుకున్నారు. ఇంకా ఈయన రాసిన 'నవభారతం' బుర్రకథ హైదరాబాద్ సంగీత నాటక అకాడమీ వారి బుర్రకథ పోటీల్లో తొలి బహుమతినందుకుంది.

80వ దశకంలో సినిమా నిర్మాణంలో వేగం పెరగడంతో 'ఈ వేగానికి మాబోటి వాళ్ళం తట్టుకోలేకున్నాం' అని ఓ సందర్భంలో అన్నా తాను చివరిదాకా సినిమాలకు రాశారు. ముఖ్యంగా ఎన్టీఆర్ అన్ని చిత్రాల్లో రాశారాయన. 'వీరబ్రహ్మంగారి చరిత్ర'లో తత్త్వాలు రాసింది కొసరాజుగారే. ఆయన చివరిసారిగా 'గురుబ్రహ్మ' చిత్రంలో బుర్రకథ రాశారు. కవిరత్న మూవీస్ బ్యానర్‌పై 'ఓ ఆడది ఓ మగాడు', 'విశ్వరూపం', 'భోళాశంకరుడు' చిత్రాన్ని సమర్పించారాయన.

తన జీవిత కాలంలో చివరి నిమిషం వరకు సినీ గేయరచన చేస్తూనే 1986 అక్టోబర్ 28న మద్రాసులో పెన్ను విడిచి తనువు చాలించారాయన. తెలుగు సినీ జగత్తులో సినీ జానపద గేయకవిరాజు కొసరాజు రాఘవయ్య చౌదరి సదా స్మరణీయుడు. ❖

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఆ బేసిస్‌పై ఉద్యోగం రాదు

నేను మున్సిపాలిటీలో ఎన్.ఎమ్.ఆర్. వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా 1-8-1984 నుండి 30-9-1985 వరకు పని చేసియున్నాను. ఆ తరువాత పనులు లేవని ఉద్యోగం నుంచి తొలగించారు. ఆఫీసు వారు సర్వీస్ సర్టిఫికెట్ ఇచ్చారు. మా కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వలన జీవనాధారం కోసం వేరే ప్రాంతంలో ఉండటం వలన, ఆఫీసులో సంప్రదించలేకపోయాను. దయచేసి నేను తిరిగి నా ఉద్యోగం పొందుటకు తగిన న్యాయసలహా ఇవ్వగలరు.

- కె.వేదాద్రి, మహబూబ్‌నగర్

మీలాగ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఎన్.ఎమ్.ఆర్.లుగా పనిచేస్తూ అప్పటి నుండి ఇప్పటి వరకు కంటిన్యూగా 20 సంవత్సరాలు చేస్తున్నవారి విషయం కూడా ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. మీ విషయానికొస్తే ఒక సంవత్సరంపాటు మాత్రమే చేసి మానుకున్నారు. కాబట్టి మీకు ఎట్టి పరిస్థితుల్లో ఆ బేసిస్‌పై ఉద్యోగం వచ్చే అవకాశం లేదు.

విభాగ దస్తావేజు చెల్లుతుందా?

1984 సంవత్సరంలో తెల్లకాగితంపై రాసుకొన్న విభాగ దస్తావేజు చెల్లుతుందా? ప్రస్తుతం విభాగ దస్తావేజు నేను రాసుకోవాలంటే తెల్లకాగితం సరిపోతుందా? రిజిస్ట్రేషన్ తప్పనిసరా? తెలుపగలరు.

- రామేశ్వరయ్య, బుగ్గమండలం, కర్నూలు జిల్లా

కుటుంబ సంబంధమైన విభాగ దస్తావేజు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయాలని ప్రొవిజన్ ఏమీలేదు. అది కుటుంబ సమక్షంలో అందరూ కలిసి ఒక అండర్ స్టాండింగ్‌కు వచ్చి రాసుకున్నదే కాబట్టి ఆ అవసరం ఉండదు. కాని ఒకరిపేరు మీద ఉన్న ఆస్తి వేరొకరికి (సహోదరుల్లో) పంపకాలు, మార్పులు జరగాలంటే రిజిస్ట్రేషన్ అవసరం ఉంటుంది.

సర్వీస్ కోడ్-వయస్సు మార్పు

నా డేటాఫ్ బర్త్ 15-6-80 ఉంటే ప్రస్తుతం అది 15-6-1977గా ఉంది. 1985లో మా నాన్న చనిపోయినందున మా అమ్మ స్కూల్‌లో జాయిన్ చేసింది. మా అమ్మ నిరక్షరాస్యురాలు. ఇప్పుడు నేను గవర్నమెంట్ జాబ్ చేస్తున్నాను. 1983లో ఇల్లు కట్టినప్పుడు ఇంటి పాస్‌బుక్‌లో నా డేట్ ఆఫ్ బర్త్ రాసి ఉంది. అప్పుడు ఆ పాస్‌బుక్‌లో మా నాన్న రాయించి పెట్టారు. మా పెద్దన్న డేట్ఆఫ్ బర్త్ కంటే నాదే ఎక్కువ ఉంది. నా కరెక్ట్ డేట్ ఆఫ్ బర్త్‌ను నా సర్వీస్ బుక్‌లో చేర్పించుకోవటానికి తగిన సలహా ఇస్తారని ఆశిస్తున్నాను.

- జె.ఎస్.సింగ్, మెదక్.

మీరు ఉద్యోగంలో ఉన్నారు కాబట్టి సర్వీస్ కోడ్ ప్రకారం మీరు ఉద్యోగంలో చేరిన సంవత్సరంలోనైతే మీరు అన్నీ సరైన సాక్ష్యాలు పత్రాలు చూపించగలిగితే అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో అప్లికేషన్ వేయాల్సి ఉంటుంది. సర్వీస్ బుక్‌లో ఒక సంవత్సరం తర్వాత మార్పు చేయడానికి అవకాశం ఉండదు.

మళ్ళీ పెళ్ళి - ఆస్తి హక్కులు

నా పేరు పవన్. నాకు మా అక్క అంటే చాలా ఇష్టం. కాని మా అక్కకు పెళ్ళి అయిన సంవత్సరానికి మా బావ చనిపోయాడు. మా అక్కకు ఒక అమ్మాయి. మా బావ పేరుమీద ఏడు ఎకరాల (ఆస్తి) పొలం ఉంది. కాని ఎటువంటి ఆస్తులకు సంబంధించిన ఫారాలు లేవు. మా అక్క వయస్సు 19 సంవత్సరాలు. మళ్ళీ మా అక్కకు పెళ్ళి చేస్తే మా అక్క కూతురికి ఆస్తి వస్తుందా రాదా, దయచేసి చెప్పగలరు. చిన్న వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్ళి చేయనీయకుండా అరికట్టాలని కోరుకుంటూ ఒక సోదరుడు.

- పవన్, బాపట్ల.

మైనర్‌గా ఉన్నప్పుడు పెళ్ళిళ్ళు జరిగితే ,ఫలితాలు ఇలానే ఉంటాయి. అది అరికట్టడానికి మనకు చట్టాలు ఉన్నాయి. వాటిమీద అవగాహన లేక జరిగే పొరపాట్లే ఇవి. మీ అక్కయ్యకు మళ్ళీ పెళ్ళి చేసుకున్నా మీ బావగారి ఆస్తిలో మీ మేనకోడలికి హక్కు ఉంటుంది. ఆ ఆస్తి మీ బావగారిదేనా, అతడి తల్లిదండ్రులున్నారా? సహోదరులున్నారా? అనేది తెలపలేదు. అది ఉమ్మడి కుటుంబమా కాదా అనేది కూడా తెలిపితే బాగుండేది. ఉమ్మడి ఆస్తి అయితే అతడి తోబుట్టువుకు కూడా హక్కు ఉంటుంది. మండల అధికారులను, గ్రామ కార్యదర్శిని కలిస్తే వివరంగా తెలుసుకోవచ్చు.

సగ్గుబియ్యం బూరెలు

కావలసిన వస్తువులు:

సగ్గుబియ్యం	: పావు కిలో
పంచదార	: పావు కిలో
కొబ్బరి తురుము	: రెండు స్పూన్లు
మైదాపిండి	: వంద గ్రాములు
పాలు	: ఒక గ్లాసు
నూనె	: పావు కిలో
ఏలకులు	: పది

తయారుచేసే విధానం:

సగ్గుబియ్యాన్ని పాలలో నానబెట్టుకోవాలి. ఏలకులు పొడి కొట్టుకోవాలి. పంచదార లేక బెల్లం కూడా తరగాలి. మైదాపిండిని జల్లించుకోవాలి. వీటన్నింటిని కలుపుకోవాలి. కొబ్బరి తురుము కూడా కలపాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. ఈ పిండిని బూరెల్లాగా చేసుకోవాలి. వేగాక తీసివేయాలి. ఇలాగే అన్నీ చేయాలి. ఇవి కొద్దిగా సాగినట్లుగా ఉండి తింటుంటే తమాషాగా ఉంటాయి. పిల్లలు ఇష్టంగా తింటారు.

చిలగడ దుంప బూరెలు

కావలసిన వస్తువులు:

చిలగడ దుంపలు	: అర కిలో
పంచదార	: పావు కిలో
మైదా పిండి	: పావు కిలో
బియ్యప్పిండి	: పావు కిలో
యాలకులు	: పది

తయారుచేసే విధానం:

చిలగడ దుంపలను మెత్తగా ఉడికించాలి. చల్లారిన తరువాత తొక్కు తీసివేయాలి. మైదా, బియ్యప్పిండిని బజ్జీల పిండిలా కలుపుకోవాలి. చిలగడ దుంపలు మెత్తగా పిసికి అందులో పంచదార, యాలకుల పొడి వేసి ముద్దగా తయారు చెయ్యాలి. నూనె బాగా కాగిన తరువాత చిలగడ దుంపల పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పల్చటి పిండిలో ముంచి వేయాలి. ఇవి గోధుమ రంగు వచ్చే వరకూ వేయిస్తే మంచిది. వేడివేడిగా తింటే ఇవి బాగుంటాయి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్
- కొత్త కోర్సుల వివరాలు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి.న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'మాథ్స్ స్కిల్స్'
- పోటీ పరీక్షల మెటీరియల్, మోడల్ పేపర్స్
- కెరీర్ గైడెన్స్
- ప్రతివారం ఓ ప్రత్యేక సమాచారం
- 'వ్యక్తిత్వవికాసం'

దీపిక

చందాదారులుగా చేరండి

సమాచారం

మీ ముంగిట నిలుస్తుంది

ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

అమూల్యమైన సమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ.150లు, పోస్టు ద్వారా రూ.160లు

అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రు.80లు, పోస్టుద్వారా రూ.85లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ./డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్. ఫోన్: 276645420, 27663761

మేనేజర్: 27673787, ఫ్యాక్స్: 2763921.

Website: www.prajasakti.com, e-mail: prajasakti@hotmail.com